ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 20.0

పవన్ మదింపు





ఎన్నికల రణరంగంలో తన సైన్యాన్ని సమర్థవంతంగా నడిపేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ అడుగులు వేస్తున్నారు. బుధవారం భీమవరంలో నరసాపురం, ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాల వారీగా నేతలు, కేడర్‌తో ముఖాముఖి భేటీ అవుతారు. ఆయా ప్రాంతాల్లో పార్టీ స్థితిగతులు, ప్రస్తుత పరిణామాలపై ఆరా తీస్తారు. ఎన్నికల పొత్తులో భాగంగా టీడీపీతో తన పార్టీ కేడర్ క్రమశిక్షణతో ఎలాంటి అడుగులు వేయాలో దిశా నిర్దేశం చేయబోతున్నారు. తాను రెండోసారి పోటీ చేయబోతున్న భీమవరం నియోజకవర్గంపైన ప్రత్యేక దృష్టి పెట్టి, ఆ మేరకు గెలుపు వ్యూహం ఖరారు చేయబోతున్నారు.

నేడు భీమవరం రాక

- రోజంతా కేడర్‌తో ముఖాముఖి భేటీలు
- పొత్తు వ్యూహంపై నేతలకు దిశా నిర్దేశం
- టీడీపీ ప్రముఖుల ఇళ్లకు వెళ్లి వారితో భేటీ
- వైసీపీ ఎత్తుగడలపై ఆరాకు వీలుగా టీంలు
- భీమవరంపై పట్టు బిగింపునకు వ్యూహం
- మాజీ మంత్రి కొత్తపల్లి చేరికకు రంగం సిద్ధం

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):
భీమవరం నుంచే పవన్ కల్యాణ్ తిరిగి పోటీకి వీలుగా రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే దీనిపై సానుకూల సంకేతాలు జిల్లా నాయకత్వానికి అందాయి. భీమవరం పట్టణంతోపాటు రూరల్‌లోనూ టీడీపీ కేడర్‌ను పరస్పరం కలుపుకుపోవడం వంటి లక్ష్యాలతో పవన్ సిద్ధమవుతున్నారు. 'ఎక్కడ పారేసుకుంటే.. అక్కడే వెతుక్కోవాలి' అనే సూక్తికి అనుసరణీయంగా ఆయన ఈసారి కూడా ఇక్కడి నుంచే బరిలోకి దిగుతున్నారు. గతంలో పార్టీ ఒంటరిగా పోటీ చేయడం, కింది స్థాయి కేడర్‌లో సమన్వయం లోపించడం, ఆ దిశగా ఓటర్లను బూత్‌లకు రప్పించేలా నేతలు సమర్థవంతంగా వ్యవహరించకపోవడం వంటి పరిణామాలపై బేరీజు వేసుకోబోతున్నారు. దీనిలో భాగంగానే మాజీ ఎమ్మెల్యే పులపర్తి ఆంజనేయులు(అంజిబాబు), టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి నివాసాలకు వెళ్లి వారితో భేటీ కాబోతున్నారు. ఓ వైపు తన పార్టీ పక్షాన సైన్యాన్ని సిద్ధం చేయడమే కాకుండా మరోవైపు టీడీపీ ముఖ్య నేతలతో భేటీ కావడం వల్ల వ్యూహం పటిష్ఠంగా ఉంటుందని భావిస్తున్నారు. వైసీపీలోనూ ఇంకొందరి నుంచి సానుకూల సంకేతాలు వచ్చిన తర్వాత వారింటికి వెళ్లి మద్దతు కోరనున్నారు.

భీమవరం నేతలతో చర్చించి, రాబోయే ఎన్నికల్లో ఎలాంటి వ్యూహం అమలు చేయాలి. ఎలా నడచుకోవాలనే దానిపై పవన్ దృష్టి పెట్టారు. వైసీపీ వ్యతిరేక గాలులు బలంగా వీస్తుండడం, మరోవైపు ఎన్నికల్లో అక్రమాలకు వైసీపీ తెగబడే అవకాశాలు ఉండడం, డబ్బుతో ముంచెత్తడం, పవన్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాను ప్రోత్సహించడం వంటి పరిణామాలపై ఇప్పటికే పవన్ దృష్టి పెట్టి, ఆ మేరకే వైసీపీ దూకుడుకు ఎలా చెక్ పెట్టాలో దిశా నిర్దేశం చేయబోతున్నారు. భీమవరంలో గెలుపు మనదేనని పూర్తిస్థాయి ధైర్యం, అనుకూల సంకేతాలు క్షేత్రస్థాయి వరకు చేర్చేలా జాగ్రత్తలు పడుతున్నారు. ప్రత్యేకించి తాను పోటీ చేస్తున్న నియోజకవర్గంపై ఓ వైపు అధికార యంత్రాంగం, మరోవైపు వైసీపీ తీసుకునే ఆకస్మిక నిర్ణయాలు ఎత్తుగడపైన ఓ కన్నేసి ఉంచాలని భావిస్తున్నారు. తదనుగుణంగా ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేయబోతున్నారని సమాచారం.

పొత్తులో ఎలా నడుచుకోవాలంటే..

రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన పొత్తు ఖరారైంది. మిగిలిందల్లా ఏ స్థానాల నుంచి రెండు పార్టీల అభ్యర్థులు పోటీ చేయబోతున్నారో త్వరలో తేల్చబోతున్నారు. పాలకొల్లు కేంద్రంగా టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేయాలనుకున్నారు. అనివార్య కారణాలు, బీజేపీతో ఎన్నికల పొత్తుకు కసరత్తు జరుగుతున్నందున తాత్కాలికంగా మేనిఫెస్టో విడుదల వాయిదా పడింది. ఇంతకు ముందే నియోజకవర్గాల వారీగా సమీక్షకు సిద్ధమై భీమవరం రావాల్సి ఉండగా, అప్పట్లో హెలిపాడ్‌కు అభ్యంతరాలు చెప్పడం, అధికార వైసీపీ కొత్త ఎత్తుగడలకు పాల్పడడంతో భేటీ రద్దయింది. పవన్ బుధవారం నుంచి నియోజకవర్గాల వారీగా తన కేడర్‌తో భేటీ కాబోతున్నారు. ప్రతి రెండు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జనసేన కన్వీనర్లు, ముఖ్య నేతలు, కేడర్ 50 నుంచి 60 మందికి మించకుండా పవన్‌తో భేటీ కాబోతున్నారు. ఎన్నికల పొత్తుపై ఆయన దిశా నిర్దేశం చేయనున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ పక్షాన కన్వీనర్ హోదాలో నేతలెవరూ లేరు. కేవలం పవన్ మీద అభిమానంతోనే ఏడాది పొడుగునా కార్యక్రమాల్లో కేడర్ పాల్గొంటూనే ఉంది. ఈ ఎన్నికల్లో ముందుగా నియోజకవర్గ కన్వీనర్ల నియామకాన్ని జనసేన పూర్తి చేయాల్సి ఉంది. ఆ దిశగా పవన్ కల్యాణ్ దృష్టి పెట్టనున్నారు. ఏలూరు, నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికే జనసైన్యం దాదాపు సిద్ధమైంది. దీనికితోడు టీడీపీతో సమన్వయంతో ముందుకు సాగేందుకు వీలుగా పవన్ తన పర్యటనను ఆసాంతం వినియోగించ బోతున్నారు. పార్టీలో అక్కడక్కడా ఉన్న గ్యాప్‌ను భర్తీ చేస్తారు. నరసాపురం పార్లమెంట్ స్థానం నుంచి ఎవరు పోటీ చేయబోతున్నారనే దానిపైన ఇప్పటికే ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానం నుండి జనసేన పక్షాన ఆ పార్టీ రాష్ట్ర ప్రొటోకాల్ ఛైర్మన్, భీమవరానికి చెందిన మల్లినీడి తిరుమలరావు(బాబి) ఈ మధ్యనే పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు రెండు రోజుల క్రితం విశాఖలో పవన్‌ను కలిసి జనసేనలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ నెలాఖరున పార్టీలో చేరనున్నట్టు ఆయన ముఖ్య అనుచరుడు వన్నెంరెడ్డి శ్రీనివాస్ ప్రకటించారు.

2019లో పార్టీకి ఓట్ల సరళి ఇలా..

గత 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన చాలాచోట్ల ఊహలకు భిన్నంగా ఓట్లను దక్కించుకుంది. నరసాపురం లోక్‌సభ స్థానం పరిధిలో భీమవరం నుంచి పోటీ చేసిన జనసేన అభ్యర్థి పవన్ కల్యాణ్‌కు 62 వేల 285 ఓట్లతో మొత్తం పోలైన ఓట్లలో 32.43 శాతాన్ని అలవోకగా దక్కించుకున్నా ఓటమి తప్పలేదు. ఇక ఒంటరిగా పోటీ చేయడం ఒక ఎత్తయితే, పార్టీ అభిమానులు, కార్యకర్తలు నేరుగా బూత్‌లకు వచ్చి ఓట్లు వేయలేకపోయారు. ఫలితంగా పవన్ ఆ ఎన్నికల్లో వెనుకబడ్డారు. నరసాపురంలో బొమ్మిడి నాయకర్ 48 వేల 700 ఓట్లు సాధించి 36.22 శాతం మేర చెప్పుకోదగిన స్థాయిలో నిలిచారు. పాలకొల్లులో గుణ్ణం నాగబాబుకు 32 వేల 984 ఓట్లు రాగా, 21.09 శాతం జనసేనవైపు మొగ్గు చూపినట్లయింది. ఆచంటలో జవ్వాజి విజయ్‌కు 13 వేల 856 ఓట్లు దక్కగా, అదే తణుకులో పసుపులేటి వెంకట రామారావు 31 వేల 502 ఓట్లు 17.33 శాతం మద్దతు కూడగట్టుకోగలిగారు. తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి శ్రీనివాస్‌కు 21.77 శాతం మేర 35 వేల 297 ఓట్లు దక్కాయి. ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రిజర్వుడు స్థానమైన చింతలపూడి నుంచి పోటీ చేసిన మేకా ఈశ్వరయ్యకు 11 వేల 739, దెందులూరు నుంచి పోటీ చేసిన ఘంటసాల లక్ష్మికి అత్యల్పంగా 6 వేల 016, ఉంగుటూరులో నౌడు వెంకటరమణకు 10వేల 721 ఓట్లు, పోలవరం ఎస్టీ రిజర్వుడు స్థానం నుంచి పోటీ చేసిన చిర్రి బాలరాజుకు 13 వేల 378 ఓట్లు, కైకలూరు నుంచి పోటీ చేసిన బీవీ రావుకు 10 వేల 300 ఓట్లు, నూజివీడులో బసవ భాస్కర రావుకు 5 వేల ఓట్లు దక్కాయి. ఏలూరు నియోజకవర్గంలో పోటీ చేసిన రెడ్డి అప్పల నాయుడు 16 వేల 681 ఓట్లు సాధించగలిగారు.

భారీ బందోబస్తు

భీమవరం, ఫిబ్రవరి 20 : జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, టీడీపీ నాయకులతో పెద అమిరం వద్ద నిర్మలాదేవి కల్యాణ మండపంలో పవన్ సమీక్షిస్తారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) చెప్పారు. రాత్రికి కల్యాణ మండపంలోనే బస చేసి, గురువారం హెలికాప్టర్‌లో మంగళగిరి వెళతారు. పవన్ పర్యటనకు పది మంది ఎస్‌ఐలు, నలుగురు సీఐలు, 43 మంది హెడ్ కానిస్టేబుల్స్, 88 మంది కానిస్టేబుల్స్‌తోపాటు మహిళా ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు కలిపి 186 మందిని బందోబస్తుకు వినియోగిస్తున్నారు. పవన్ పర్యటన విజయవంతానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్ తెలిపారు.


హెలిప్యాడ్

నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్‌గా పార్థసారథి

తెలుగుదేశానికి ముద్దరబోయిన రాజీనామా.. వైసీపీలో చేరిక



నూజివీడు, ఫిబ్రవరి 20 : నూజివీడులో రాజకీయ సమీకరణాలు, గంటల వ్యవధిలో మారి పోయాయి. టీడీపీని బలహీనపర్చటానికి వైసీపీ వేసిన ఎత్తుగడలకు దీటుగా ఆ పార్టీ అధినాయకత్వం పావులు కదిపింది. ముద్దరబోయిన వెంకటేశ్వరరావును నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తొలగిస్తూ ఆయన స్థానంలో కొలుసు పార్థసారధిని నియమించింది. ముద్దరబోయిన విషయంలో టీడీపీ రెండుసార్లు అవకాశం ఇచ్చినా ఫలితం లేకపోవడంతో మూడోసారి ప్రయోగాల జోలికి వెళ్లకుండా వ్యూహాత్మకంగా ఆయన స్థానంలో అదే బీసీ వర్గానికే చెందిన పార్థసారధిని నూజివీడు బరిలోకి దింపుతోంది. పెనమలూరును ఇష్టపడిన పార్థసారధిని నూజివీడు నుంచి బరిలోకి దింపే విషయంలో టీడీపీ వ్యూహాత్మ కంగా వ్యవహరించింది. ముద్దరబోయినను పక్కన పెట్టడంతో ఆయన టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలోకి వెళ్లడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. గతంలో స్వతంత్ర అభ్యర్థిగా గన్నవరంలో గెలిచిన ఆయనను వైసీపీ నుంచి గన్నవరం అభ్యర్థిగా, గన్నవరంలో సిట్టింగ్ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని మైలవరం నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దింపనున్నట్లు సమాచారం.

బెంచీలు మారనున్నాయి

ప్రస్తుత అసెంబ్లీలో నూజివీడు, పెనమలూరు నియోజకవర్గాల నుంచి వైసీపీ ఎమ్మెల్యేలుగా గెలిచిన మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పార్థసారధిలు సహచరులే కాక బెంచ్‌మేట్‌లు కూడా. ఇప్పుడు ఈ నియోజక వర్గంలో వారు ప్రత్యర్థులుగా మారటం విశేషం. వీరిమధ్య ఇంకా ప్రత్యక్ష యుద్ధం ప్రారంభం కాలేదు. ఈ నెల 26న పార్థసారధి తెలుగుదేశం జెండా కప్పుకోనున్నారు. తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో నూజివీడులో పార్థసారధి టీడీపీలో అరంగేట్రం చేయటానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఉత్తరాంధ్ర పర్యటనలో వున్న లోకేశ్‌ను ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించటానికి సారధి మంగళవారం లోకేశ్ దగ్గరకు వెళ్ళినట్లు సమాచారం. మేకా అప్పారావు ఈసారి ఎన్నికల్లో తనకు బదులుగా తన కుమారుడిని బరిలోకి దింపటానికి ప్రయత్నాలు చేస్తున్నారనే విషయం ప్రచారం జరుగుతోంది. ఇది ఎంత వరకు ఫలిస్తుందో వేచిచూడాలి. ముద్దరబోయిన టీడీపీకి రాజీనామా చేసి వైసీపీ నుంచి వేరే నియోజకవర్గంలో పోటీ చేయటానికి రంగం సిద్ధమవడంతో నూజివీడులోని ముద్దరబోయిన సానుభూతిపరుల్లో ఏర్పడిన కొద్దిపాటి గందరగోళం సద్దుమణుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.


శిక్షణ పొందిన సేఫ్టీ కో ఆర్డినేటర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

రోడ్డు భద్రత అందరి బాధ్యత : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20: మితిమీరిన వేగంతో మోటారు సైకిల్‌ను నడుపుతూ విన్యాసాలు చేస్తూ వీడియోలను వైరల్ చేసే ఆకతాయిలపై సుమోటోగా కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీకి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. 32వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు ముగింపు సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల విద్యార్థులు రహదారులపై ఎదుటి వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ మితిమీరిన వేగంతో బైక్‌పై ప్రయాణిస్తూ ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సమాజంలో ఆటో డ్రైవర్లు, ప్రయాణికుల ప్రాణాలు కాపాడే రథసారథులు ఆటోడ్రైవర్లని కొనియాడారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఎస్పీ మేరీప్రశాంతి మాట్లాడుతూ ఆటోడ్రైవర్, లారీడ్రైవర్లు, ట్రక్ డ్రైవర్లు మద్యం సేవించి వేగంతో వాహనాలు నడిపి, వారి ప్రాణాలతోపాటు ఎదుటివారి ప్రాణాలు తీస్తున్నారన్నారు. ఉపరవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి మాట్లాడుతూ బైపాస్, ఎన్‌హెచ్ రహదారుల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్‌మోషే, డీఎస్పీ ప్రభాకర్, ఆర్టీవో వరప్రసాద్, శ్రీహరి, ఎంవీఐలు కె.వి.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సేఫ్టీ కో ఆర్డినేటర్లుగా శిక్షణ పొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

పశ్చిమ కలెక్టరుగా సుమిత్‌కుమార్ గాంధీ బాధ్యతల స్వీకరణ



భీమవరం, ఫిబ్రవరి 20 : జిల్లా కలెక్టరుగా సుమిత్ కుమార్ గాంధీ మంగళవారం సాయంత్రం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ ఛాంబరులో పదవీ బాధ్యతలను చేపట్టారు. జిల్లాల విభజన అనంతరం భీమవరం కేంద్రంగా పశ్చిమ గోదావరి జిల్లాను ఏర్పాటు చేయడంతో జిల్లాకు మొట్టమొదటి కలెక్టరుగా పి.ప్రశాంతి ప్రజలకు సేవ అందించగా, రెండో కలెక్టరుగా సుమిత్‌కు మార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధి కారులు, స్థానిక నాయకులు నూతనంగా బాధ్యతలు చేప ట్టిన కలెక్టరుకు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు.

ఉద్యమ గర్జన

ఏపీజేఏసీ ఉద్యమ శంఖారావం

» ఏలూరులో భారీ ర్యాలీ, ధర్నా

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : 'ఉద్యోగులు దాచుకున్న డబ్బును వాడేసుకున్నారు. అప్పులపాలు చేసి రోడ్డున పడేశారు. మా న్యాయమైన సమస్యలను పరిష్కరించటానికి దిగిరాకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు' అంటూ ప్రభుత్వ ఉద్యోగులు జగన్ సర్కార్‌ను హెచ్చరించారు. ఈ ప్రభుత్వానికి ఇదే చివరి అవకాశమని, ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యోగులు తీసుకునే నిర్ణయానికి పశ్చాత్తాపడినా ప్రయోజనం ఉండదన్నారు. ఉద్యమ శంఖారావం పిలుపులో భాగంగా మంగళవారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు రణభేరి మోగించాయి. ర్యాలీ, ధర్నాతో నినదించారు. కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున నిరసనకు దిగారు. ఏపీ జేఏసీ పిలుపుమేరకు ఊహించని ప్రతిఘటనను ఉద్యోగులు చూపించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఏపీ జేఏసీ ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సాధించే వరకు ఆందోళన సాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల ఉద్యమాన్ని చల్లార్చేందుకు ప్రతిసారి చర్చల పేరుతో పిలవడం, హామీలు గుప్పించడం, వాటిని నెరవేర్చకుండా వాయిదాల మీద వాయిదాలు వేస్తూ మైండ్‌గేమ్ ఆడుతోందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో అర్థం అవుతోందన్నారు. తమ సహనాన్ని పరీక్షించవద్దని, తక్షణం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణ, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న ఛలో విజయ వాడ తప్పదని హెచ్చరించారు. ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరించాం. ప్రభుత్వం ఆదుకుంటుందని అనుకున్నాం. మోసం చేస్తుందని అనుకోలేదన్నారు. ప్రభుత్వంపై తాడోపేడో తేల్చుకోవడానికి తాము సిద్ధం అన్నారు. ఏపీజీఎల్ఐ రుణాలు, ఐఆర్ 30 శాతం పెంచాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తొలుత ఫైర్‌స్టేషన్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ చేరుకుని ధర్నా నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ నెరుసు రామారావు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో భారీ ర్యాలీ చేస్తున్న ఉద్యోగులు

● ఆటోలపై ఈ చలానాలు రద్దు చేయాలి


ఆటో డ్రైవర్ల ఆందోళన

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : ఆటోలపై ఈ చలానాలు రద్దు చేయాలని ఏలూరు సిటీ, రూరల్ ఆటో యూనియన్ అసోసియషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తొలుత కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అధ్యక్షుడు లీలా కృష్ణ మాట్లాడుతూ పాత బస్టాండ్ వద్ద వున్న ట్రాఫిక్ సిగ్నల్స్ కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. స్టాప్‌లైన్ ఒక చోట, జీబ్రాలైన్ ఒకచోట ఉన్నాయన్నారు. ఇది గమనించక ఆటో డ్రైవర్‌లకు ఈ చలానా పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. విధించిన ఈ చలానా రద్దు చేసి ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ మార్చాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ కె.బాబురావు, నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

● ఓం నమో నారసింహా




ద్వారకా తిరుమల శ్రీవారి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలో వధూవరులైన లక్ష్మీనారసింహులు.

అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి రథయాత్ర అశేష భక్త జనుల మధ్య అంగరంగ వైభవంగా సాగింది.

ఇంటర్ హాల్ టిక్కెట్ల జారీపై దుమారం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20 : ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు పరీక్షలకు సంబంధించి పలు ప్రైవేటు, కార్పొరేటు కళాశాలల యాజమాన్యాలు పూర్తి ఫీజు చెల్లిస్తేనే హాల్ టిక్కెట్ ఇస్తామని విద్యార్థులను బెదిరిస్తున్నాయంటూ పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కె.నాని, క్రాంతి, సునీల్, రాజు తదితరులు మంగళవారం డీవీఈవో కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. రాష్ట్రప్రభుత్వం ఏటా కళాశాలల యాజమాన్యంతో నిమిత్తం లేకుండా విద్యార్థులే నేరుగా హాల్ టిక్కెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే లింక్‌ను విడుదల చేస్తున్నట్టుగానే ఈ ఏడాది ఈ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీనిపై డీవీఈవో ప్రభాకరరావును వివరణ కోరగా 'ఇంత వరకు డౌన్‌లోడ్ ఎనేబుల్ ఆప్షన్‌ను ఇవ్వనపుడు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టిక్కెట్లను ఇవ్వకుండా వేధిస్తున్నాయనే ఆరోపణలు అసత్యం. హాల్ టిక్కెట్లకు సంబంధించిన వెబ్‌సైట్ లాగిన్‌ను ఇంటర్ బోర్డు బుధవారం పెట్టనుంది. ఆ తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది' అని తెలిపారు.



పోలవరం జిల్లా ఏర్పాటు మహాసభలో మాట్లాడుతున్న బొరగం శ్రీనివాస్

పోలవరం జిల్లా కావాలి

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఇదొక్కటే మార్గం : మహాసభలో నేతలు

పోలవరం, ఫిబ్రవరి 20 : గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక పోలవరం జిల్లా సాధన ఒక్కటే మార్గమని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు స్పష్టం చేశారు. పోలవరం జిల్లా సాధన ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం పోలవరంలో నిర్వహించిన మహాధర్నా, మహాసభ జరిగింది. ఈ సందర్భంగా బొరగం మాట్లాడుతూ అధికారంలోకి రాగానే పోలవరం జిల్లా ప్రకటిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు మాట్లాడుతూ ప్రత్యేక పోలవరం జిల్లా ప్రాంతాల అభివృద్ధి కోసమని దయచేసి అన్ని పార్టీల నాయకులు దీని సాధనకు కృషి చేయాలని, దీనిని రాజకీయం చేయవద్దని కోరారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిబండి నాగరాజు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో అటు గిరిజన నిర్వాసిత గ్రామాల ప్రజలు, ఇటు మండల కేంద్ర ప్రజలు నష్టపోయారన్నారు. పోలవరం ఏలూరు జిల్లాకు మారుమూల గ్రామమై అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా ఏటిగట్టు సెంటర్‌లో మహాధర్నా చేశారు. ర్యాలీలో 'పోలవరం మా లక్ష్యం, జిల్లా కేంద్రం మా ధ్యేయం' అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. మహాధర్నాలో ఐకాసతోపాటు వివిధ పార్టీల నాయకులు నాళం గాంధీ, బుగ్గా మురళీకృష్ణ, గంగు అనిల్‌కుమార్, సొబ్బన ఆనంద్, సొబ్బన మోహన్, సొబ్బన రాజశేఖర్, కొణతాల ప్రసాద్, కుంచే దొరబాబు, జేవీ నరసింహారావు, పీఎల్‌ఎస్ కుమారి, మంగిన కొండ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజును ఆహ్వానించినా ఆయన రాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

పుట్టింటికి వచ్చినట్లుంది

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్


వాసవీ మాతకు అలంకరించే బంగారు కిరీటంతో నిర్మలా సీతారామన్

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 20 : "నేను పీఎం లంకను దత్తత తీసుకోలేదు. మీరు నన్ను దత్తత తీసుకుని మీ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. ఈ డిజిటల్ భవనాన్ని కట్టించడం వల్ల వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని నేను ఊహించలేదు.. నేడు ఇక్కడ శిక్షణ, ఉపాధి కల్పనలో ఈ ట్రైనింగ్ కాలేజీ దేశంలోనే మొదటిగా నిలవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఈ ఊరికి వస్తే నాకు పుట్టింటికి వచ్చినట్లు ఉంటుంది" అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆనందోత్సాహాన్ని వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఉపాధి కల్పనకు ఈ ట్రైనింగ్ సెంటర్ ఒక కేంద్రంలా ఉండాలన్నారు. మంగళవారం నరసాపురం మండలం పీఎం లంకలో విశ్వ కర్మ యోజన, చేతి వృత్తుల్లో శిక్షణ పొందిన నిరుద్యోగులకు మంత్రి సర్టిఫికెట్లను అందించారు. దేశంలో ఎక్కడా దొరకని నైపుణ్యవంతమైన శిక్షణ ఇక్కడ ఇస్తున్నారు. ఇప్పుడు పీఎం లంక పేరు దేశంలో మారుమోగుతోంది. రానున్న రోజుల్లో ఈ సెంటర్‌లో మరిన్ని కొత్త కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఈ టెక్నాలజీని పైలట్ ప్రాజెక్టుగా పీఎం లంకలో వాడుతున్నామన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, చీఫ్‌విప్ ముదునూరి, కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ, సర్పంచ్ కొల్లాటి కనకదుర్గ, నాగరాజు, పీవీఆర్, పేరాల మోహన్ తదితరులు పాల్గొన్నారు

వాసవీ ధామ్‌లో పూజలు

పెనుగొండ/ఆచంట, ఫిబ్రవరి 20 : పెనుగొండ వాసవీ ధామ్‌ను దర్శించుకోవడం ఎంతో ఆనందం కలిగించిందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేజీన్నర బంగారంతో తయారు చేయించిన కిరీటాన్ని అమ్మ వారికి అలంకరించే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ట్రస్టు అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కార్యదర్శి సతీష్, సభ్యులు ఘన స్వాగతం పలికారు.


ఆసుపత్రిలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకుంటున్న జేసీ


ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న శంకర్ నాయక్

విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉంది : జేసీ

జీలుగుమిల్లి/జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 20 :జీలుగుమిల్లి ఆశ్రమ పాఠశాల వసతి గృహం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఏలూరు జిల్లా జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. జీలుగుమిల్లి ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో సోమవారం అస్వస్థతకు గురై జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎనిమిది మంది విద్యార్థులు శృతికుమార్, ఎస్.వినయ్‌కుమార్, కె.అశోక్‌కుమార్, ఎం.సాయిబాబు, ఎం.హరికృష్ణ,ఎం.రామ్‌కుమార్, ఎం.కృష్ణచైతన్య కె.గౌతమ్‌లను ఆమె మంగళవారం పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆదేశించారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో ఎనిమిది మంది వైద్యం పొందారని, వీరిలో ఓ విద్యార్థికి గుండె సంబంధిత వ్యాధి ఉండడంతో విజయవాడ ఆంధ్ర ఆస్పటల్‌కు తరలించామన్నారు. మాంసాహారం వండే సమయంలో సిబ్బంది వాటి నాణ్యతను తప్పకుండా పరిశీలించాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థుల అస్వస్థతపై నివేదిక అందించండి

విద్యార్థుల అస్వస్థతపై విచారణ చేసి నివేదిక అందించాలని అధికారులను ఆమె ఆదేశించారు. విద్యార్థులకు పూర్తిగా ఆరోగ్య పరిస్థితి కుదుటపడిన తరువాత మాత్రమే ఆసుపత్రి నుంచి పంపాలని ఆర్డీవో, స్థానిక తహసీల్దార్‌ను ఆమె ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఈ నాయుడు, ఇన్‌చార్జి తహసీల్దార్ కె.వరలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల, డీటీ రమేశ్, వీఆర్వో సురేశ్, ఆసుపత్రి హెచ్‌డీఎస్ సభ్యుడు ఆర్.భావనా ఋషి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం కన్పిస్తోంది : శంకర్‌నాయక్

గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విషయమై ఎస్టీ కమిషన్ దృష్టికి వచ్చిందని సభ్యులు ఒడిత్య శంకర్‌నాయక్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న విద్యార్థులు ఆరోగ్యంగానే ఉన్నారన్నారు. మంగళవారం సాయంత్రం జీలుగుమిల్లి ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో సమస్యలపై ఆయన చర్చించారు. వసతిగృహంలో పరిసరాల్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సరుకుల నిల్వల రిజిస్టరు పరిశీలించాలని తహసీల్దారును ఆదేశించారు. మరుగుదొడ్ల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉందన్నారు. హెచ్‌ఎం, ఏటీడబ్ల్యూవోల నిర్లక్ష ధోరణి కన్పిస్తుందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘట నలు పునరావృతం కాకుండా శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య, ఐటీడీఏ డీడీ కేవీఎస్.నాయుడు, సీఐ క్రాంతికుమార్, తహసీల్దారు ఆర్‌వీ.వెంకటేశ్వరరావు ఉన్నారు.

● బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రామచంద్రప్రసాద్ కూడా జీలుగు మిల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులను మంగళవారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఏలూరులో 'ప్రవీణ్ ఐపీఎస్' చిత్రం సందడి


ఏలూరు చిత్రం యూనిట్ సభ్యులు

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 20:రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'ప్రవీణ్ ఐపీఎస్' చిత్రం యూనిట్ మంగళవారం ఏలూరులో సందడి చేసింది. ఏలూరు పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు చిన్న మార్కండేయులు కుమారుడు దుర్గాదేవ్‌నాయుడు సుమారు పదేళ్ళుగా చిత్రపరిశ్రమలో ఉంటూ తాజాగా అతడే డైరెక్షన్ చేస్తూ ముఖ్యపాత్ర పోషిస్తూ ప్రవీణ్ ఐపీఎస్‌ను తెరకెక్కించారు. ఏలూరు విజయలక్ష్మి థియేటర్‌లో ఈ చిత్రం ప్రదర్శిస్తున్నారు. ఉదయం యూనిట్ సభ్యులు సందడి చేశారు. ఐపీఎస్ అధికారిగా, గురుకులాల్లో చైతన్యవంతమైన మార్పులు తీసుకువచ్చి బీఎస్పీ తెలంగాణ అధ్యక్షుడిగా ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. ఆయన జీవిత కథకు అనుగుణంగా ఈ చిత్రం తీసినట్టు తెలిపారు. ఈ చిత్రంలో సన్నివేశాలు అందరిని ఆలోచింపచేస్తాని, యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదనే కాన్సెప్ట్‌తో చిత్రం రూపొందించామని తాను హీరోగా నటించినట్టు దుర్గాదేవ్ తెలిపారు. ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ పాత్రలో బుల్లితెర నటుడు నందకిషోర్, హీరోయిన్‌గా రోజాఖుషి నటించారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు.

మంత్రి ఇంటి వద్ద యువజన కాంగ్రెస్ ధర్నా


కారుమూరి ఇంటి వద్ద ధర్నా చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

తణుకు, ఫిబ్రవరి 20 : రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఇంటి వద్ద ఏపీ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'దగా డీఎస్సీ వద్దు మెగా డీఎస్సీ' ముద్దు అంటూ ధర్నా నిర్వహించారు. మంగళవారం ధర్నా వద్ద ఏపీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు మాట్లాడుతూ నిరుద్యోగులను సీఎం జగన్ ప్రభుత్వం దగా చేసిందని పేర్కొన్నారు. వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి అనంతరం విడుదల చేశారు. కార్యక్రమంలో అంకెం సీతారాం, సోము నాగేశ్వ, దిర్సిపో రామకృష్ణ, కోరిపల్లి సత్యనారాయణ, పుప్పు కాశీ, ఆకుల సాయి తదితరులు పాల్గొన్నారు.


పెద్దాపురం వద్ద పులి పాదముద్ర


ట్రాప్ కెమెరా ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

మళ్లీ పులి భయం..

పోలవరం మండలంలో పాదముద్రల గుర్తింపు

పులి కదలికలపై అటవీశాఖ సిబ్బంది దృష్టి.. ఆందోళనలో ప్రజానీకం

పోలవరం, ఫిబ్రవరి 20 :పోలవరం మండలంలో పులి సంచారంతో ప్రజల్లో మళ్లీ టెన్షన్ మొదలైంది. మంగళవారం ప్రగడపల్లి శివారున నర్సరీలో పులి సంచరించినట్టు పాదముద్రలు చూసిన నిర్వాహకులు అటవీశాఖకు సమాచారం అందించడంతో సిబ్బంది తరలివెళ్ళారు. రెండు రోజులుగా మండలంలో ప్రగడపల్లి, జిల్లెల్లగూడెం పంచాయతీల పరిధిలో రెడ్డినాగంపాలెం, గుంజవరం గ్రామాల శివారున పంటపొలాల్లో పులి సంచరించినట్టు పాదముద్రలు కనిపించడంతో అటవీశాఖ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. పోలవరం మండలంలో ఉడతపల్లిలో, బుట్టాయిగూడెం మండలం కొవ్వాడ, ముంజులూరు ప్రాంతాల్లో సంచరించి పాడిపశువులపై దాడులకు పాల్పడిన పులి తన గమనం పాపికొండల నేషనల్‌పార్కు వైపు కాకుండా పోలవరం కుడి కాల్వ వైపు వెళుతున్నట్లుగా పలువురు భావిస్తున్నారు. దేవరపల్లి మండలం బందపల్లి సమీపంలో పంటపొలాల్లో పులి పాదముద్రలు కనిపించినట్టు అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో పులి మళ్ళీ ద్వారకాతిరుమల మండలం వైపు మళ్ళిందా..? అనే సందేహం పలువురు వ్యక్తం చేస్తున్నారు. పులి సంచారంపై సోషల్ మీడియాల్లో ప్రచారం కొనసాగడంతో పోలవరం, గోపాలపురం, బుట్టాయిగూడెం, దేవరపల్లి మండలాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ విషయంపై అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదురాజుని వివరణ కోరగా దేవరపల్లి మండలం బందపల్లిలో పులి పాదముద్రలు పరిశీలించామని, గోపాలపురం మండలం పెద్దాపురం వద్ద పోలవరం కుడి కాల్వ గట్టు వెంబడి మళ్లీ వెనుదిరిగి వచ్చినట్టుగా పాదముద్రల ద్వారా పరిశీలించామన్నారు. ఎక్కడికక్కడ ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, పులి నేషనల్ పార్కులోకి వెళ్ళే వరకూ ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాత్రి వేళల్లో ప్రజలు బయట సంచరించరాదని సూచించారు.





బుట్టాయగూడెం, పాలకొల్లులో వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు, పెదవేగిలో సీఐ శ్రీనివాసకుమార్‌కు, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఏపీయుడబ్ల్యుజే సభ్యులు

దాడి దారుణం

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిని నిరసిస్తూ జర్నలిస్టుల నిరసన.. వినతి పత్రాల అందజేత

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టుపై వైసీపీ నాయకుల మూకుమ్మడి దాడి అత్యంత దారుణం.. అని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు ఖండించారు. ఈ మేరకు మంగళవారం కూడా ఆందోళనలు నిర్వహించి తహసీల్దార్ కార్యాలయాల వద్ద అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

జర్నలిస్టులకు రక్షణ కల్పించండి : ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

పెదవేగి, ఫిబ్రవరి 20 : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన నిందితులను తక్షణం అరెస్టుచేసి, కఠినంగా శిక్షించాలని కోరుతూ దెందులూరు నియోజకవర్గం ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఇటువంటి ఘటనలు సమాజంలో పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే మీడియాపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాని తగిన చర్యలు తీసుకోవాలని సీఐకు విన్నవించారు. స్పందించిన సీఐ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ మీడియా రంగంలో పనిచేస్తున్న వారికి రక్షణ కల్పించడానికి అన్నిచర్యలు తీసుకుంటామన్నారు.

జర్నలిస్టుపై దాడి దారుణం : సోమసుందర్

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 20: రాప్తాడులో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి దారుణమని బీజేయూ జాతీయ కార్యదర్శి దూసనపూడి సోమసుందర్ అన్నారు. దాడిని ఖండిస్తూ తాడేపల్లిగూడెం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద పాత్రికేయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడిపై గుడివాడ ఎమ్మెల్యే స్పందించిన తీరు బాధాకరమన్నారు. తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తమ్మిశెట్టి రంగసురేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తేవాలన్నారు. అనంతరం ఆర్డీవో చెన్నయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి గజపతి ప్రసాద్, సరికొండ రవికుమార్ రాజు, వానపల్లి పుండరీకాక్షుడు, శీలి రాజు, కాసాని వెంకటరత్నం, చిక్కాల రామకృష్ణ, ఏవీ రామరాజు, పాలడుగు సతీష్, ఖాదర్ మొహిద్దీన్, మైలవరపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టుల నిరసన

దాడి దుర్మార్గం : పాలకొల్లు ప్రెస్ క్లబ్ నాయకులు

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 20 : ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని పాలకొల్లు ప్రెస్‌క్లబ్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నినాదాలు చేస్తూ దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పి.మధుసూదన రావుకు ప్రెస్ క్లబ్ సభ్యులు వినతిపత్రం అందచేశారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ, కార్యదర్శి ఎంఎస్‌వీ సాంబశివరావు. కోశాధికారి తోట రాంబాబు, ఏపీయూడబ్ల్యూజే కోశాధికారి ముచ్చర్ల శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి పులపర్తి నాని, సంయుక్త కార్యదర్శి బండి శ్రీను, ప్రెస్‌క్లబ్ సభ్యులు గోపరాజు గోపి, తమ్మినీడి మురళీకృష్ణ, శీలబోయిన జయరామకృష్ణ, రాపాక రవిబాబు, కూనపరెడ్డి చిన్ని, కాపిశెట్టి గోపాలరావు, మండెల అప్పలరాజు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో..

బుట్టాయగూడెం : ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకల దాడిని ఖండిస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి జక్కుల దాసు ఆధ్వర్యంలో బుట్టాయగూడెం ప్రెస్‌క్లబ్ సభ్యులు నిరసన తెలిపారు. జర్నలిస్టులు క్రాంతినాథ్, కృష్ణమోహన్, మురళి, భాస్కర్, రామకృష్ణ, రవి, బాబ్జి, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి


కేంద్ర మంత్రి నిర్మలకు పాత్రికేయుల వినతి

ఆచంట/పెనుగొండ, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన వైసీపీ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఆచంట నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం పెనుగొండ విచ్చేసిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వైసీపీ అల్లరి మూకలపై తక్షణం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వినతిపత్రం సమర్పించారు. అనంతరం పెనుగొండ డిప్యూటీ తహసీల్దార్ అన్నపూర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు జక్కంశెట్టి శ్రీనివాసరావు, గుర్రాల శ్రీనివాసరావు, షణ్ముఖ్, వనం సత్యనారాయణ, అబ్రహం, మోహనరావు, విజయకుమార్, పాలా కుమార్, రాజశేఖర్, ఉపేంద్ర, సుబ్బరాజు, రాంబాబు, పుసులూరి శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడులకు ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆందోళన

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 20 : విధి నిర్వహణలో భాగంగా ఎన్నికల సభలకు, రాజకీయ పార్టీల కార్యక్రమాలకు హాజరవుతున్న జర్నలిస్టులపై ఇటీవల దాడులు పెరిగిపోయాయని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల సిద్ధం వైసీపీ సభలో, టీడీపీ రా.. కదలిరా కార్యక్రమంలో పాల్గొన్న మీడియా ప్రతినిధులపై దాడులు, దౌర్జన్యకాండలను నిరసిస్తూ మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలోను, పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మీడియా హౌస్ నాయకులు గొల్ల మండల శ్రీనివాసరావు, పీఎన్‌వీ రామారావు విలేకరులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రియదర్శిని కళాశాల సీపీ అలుగు ఆనంద శేఖర్, రాష్ట్ర కార్యదర్శి కేఎస్ శంకరరావు, ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కలపాల శ్రీనివాసరావు, ఏపీ బీజేపీ ప్రతినిధి అచ్యుత సూర్య, లోకేష్, కిషోర్, కలపాల చందు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం

రథంపై ఊరేగిన స్వామి, అమ్మవార్లు ▸ గోవింద, నరసింహ నామస్మరణతో పోటెత్తిన భక్తులు


స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

అంతర్వేది, ఫిబ్రవరి 20: గోవింద నామస్మరణలతో అంతర్వేది పురవీధుల్లో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం మంగళవారం మధ్యాహ్నం లక్షలాదిమంది భక్తజన సందోహాల మధ్య వైభవంగా జరిగింది. తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి సోదరి అశ్వరూఢాంబిక(గుర్రాలక్కమ్మ)కు చీర, సారె లాంఛనప్రాయంగా తీసుకువెళ్లారు. తొలుత ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ మొగల్తూరు రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్ రథానికి తొలిపూజ చేశారు. అనంతరం కొబ్బరికాయ, గుమ్మడికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్, డీసీ విజయరాజు, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి కొబ్బరికాయలు కొట్టారు. ఆలయం నుంచి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ లక్ష్మీనరసింహస్వామివారి ఉత్సవ మూర్తులను రథంపై కొలువు తీర్చి ఊరేగింపుగా గుర్రాలక్కమ్మ గుడికి తీసుకువచ్చారు. రాజావారి వీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపు వీధిలోని 16 స్తంభాల మండపానికి చేరుకోవడానికి సుమారు నాలుగు గంటలు పట్టింది. గోవింద, నరసింహ నామస్మరణలతో రథాన్ని భక్తులు లాగారు. భీష్మఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. జంగమ దేవరులు పూరించిన శంఖాల ధ్వనితో సాగర సంగమ తీర ప్రాంతం మార్మోగింది.

రథోత్సవానికి 58 వసంతాలు పూర్తి..

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ శుభ ఘడియలు ముందుగా రావడం, అనంతరం భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి రథోత్సవం 58 వసంతాలు పూర్తి చేసుకుని రథంపై కొలువు దీరిన స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

అక్షింతల కోసం భక్తుల ఎదురుచూపులు

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అనంతరం తలంబ్రాల అక్షింతల బియ్యం కోసం భక్తులు బారులు తీరారు. అక్షింతలు కల్యాణ ఘడియల సమయంలో పంపిణీ చేస్తారని భక్తులు మండపం ప్రదేశానికి దూసుకొచ్చారు. భక్తులకు మైక్ ప్రచారం ద్వారా అధికారులు ఉదయం సుప్రభాత సేవతో మొదలయ్యే దర్శన క్యూలైన్లలో కల్యాణోత్సవ అనంతర అక్షింతలు పంపిణీ చేశారు.

వరుడైన నారసింహుడు

▸ సుందరగిరిపై ప్రారంభమైన కల్యాణోత్సవాలు


నారసింహునికి హారతులిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 20: స్వయం భువమూర్తిగా సుందరగిరిపై కొలువైన లక్ష్మీనారసింహుడు పెండ్లి కుమారుడయ్యారు. వేదమంత్రోచ్చరణల నడుమ కనకవల్లీ, లక్ష్మీ అమ్మవార్లు పెండ్లి కుమార్తెలయ్యారు. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్.జగన్నాథపురంలో స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 25 వరకు జరుగనున్న కల్యాణ మహోత్సవాలను నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. అధికసంఖ్యలో భక్తులు మూలవిరాట్‌ను, కల్యాణమూర్తులను దర్శించారు.

నేడు గజ, పొన్న వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 4 గంటలకు లక్కవరం వాస్తవ్యులు మంగెన నాగేశ్వరరావు వారిచే నిర్మించిన గజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం. సాయంత్రం 7 గంటలకు పోలమూరి సత్రం నిర్వాహకులచే అన్నపర్వత మహానివేదన, రాత్రి 8 గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి వెంకటసత్యనారాయణ, శ్రీహరిరావులచే నిర్మితమైన పొన్న వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

రాష్ట్రాలు వేరైనా అన్నదమ్ములమే..

▸ తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


తెలంగాణ మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రభాకర్

పెదవేగి/కామవరపుకోట/జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 20 : 'రాష్ట్రాలు వేరైనా మూలం ఒక్కటే, మనమంతా తెలుగుజాతి బిడ్డలం. అంతా అన్నద మ్ములమే.. అప్పుడే మరింత అభివృద్ధి సాధ్యం' అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. మంగళవారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం వచ్చిన ఆయనను దెందులూరు, చింతలపూడి మాజీ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళీ రామకృష్ణ పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. అనంతరం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కామవరపుకోట మండలం తడికలపూడిలోని సొసైటీ మాజీ అధ్యక్షుడు బొప్పన అంజయ్య నివాసం వద్ద రైతులతో కొద్దిసేపు భేటీ అయ్యారు. పామాయిల్, వాణిజ్య పంటల స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆ తరువాత విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం పట్ల అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేలా ముందుకు సాగాలన్నారు. రైతాంగం నిర్వహిస్తున్న నిరసన కేంద్ర ప్రభుత్వం త్వరగా అర్థం చేసుకుని అన్నదాత కష్టాలను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల రైతాంగం తరపున కేంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

త్వరలో జనసేన గూటికి 'కొత్తపల్లి'



నరసాపురం, ఫిబ్రవరి 20: మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేన పార్టీలో చేరుతున్నట్టు పట్టణంలోని 5వ వార్డు కౌన్సిలర్ వన్నెంరెడ్డి శ్రీనువాస్, సీనియర్ నాయకులు గుగ్గిలపు మురళీ తెలిపారు. మంగళవారం రాత్రి విలేకర్లతో వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం పవన్‌కల్యాణ్‌ను విశాఖలో కొత్తపల్లి కలిసి పార్టీలో చేరేందుకు అనుమతి తీసుకున్నారన్నారు. ముహూర్తం పెట్టుకుని ఈ నెలాఖరులో అమరావతిలో అధినేత సమక్షంలో కొత్తపల్లి పార్టీలో చేరుతున్నట్టు వన్నెంరెడ్డి తెలిపారు. ఆయన సోదరుడు జానకీరామ్ కూడా జనసేనలో చేరుతారన్నారు. గత ఎన్నికల్లో వైసీపీలో చేరిన కొత్తపల్లి జిల్లా కేంద్రంపై పార్టీకి వ్యతిరేకంగా పోరాడి సస్పెండ్‌కు గుర య్యారు. అప్పటి నుంచి ఏ పార్టీలో చేరలేదు. గత నెల రోజుల నుంచి ఆయన చేరికపై పలు ఊహాగానాలు షికారు చేశాయి. వాటిని కొత్తపల్లి అధికారికంగా వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో ఆయన ముఖ్య అనుచరుడైనా వన్నెంరెడ్డి శ్రీనివాస్ జనసేనలో చేరుతున్నట్టు ప్రకటించడం చర్చనీయాంశమైంది. సమావేశంలో మల్లిపూడి చిన్నబాబు పాల్గొన్నారు.

చెరువుల తవ్వకాలు జరగడం లేదు : డీఎఫ్‌వో

భీమడోలు, ఫిబ్రవరి 20:కొల్లేరు అభయారణ్యంలో ప్రస్తుతం ఎటువంటి చెరువుల తవ్వకాలు జరగడం లేదని గుర్తించినట్టు డీఎఫ్‌వో హిమశైలజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజులుగా గుంటూరు విజిలెన్స్ బృందం, రాజమండ్రి ఫ్లైయింగ్ స్క్వాడ్, గుంటూరు-విశాఖపట్టణం ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో పాటు కొల్లేరు అటవీ సిబ్బందితో కలిసి పర్యటించామన్నారు. భీమడోలు మండలంలోని లక్ష్మీపురంతోపాటు కైకలూరు మండలాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు.

భక్త జనసంద్రం.. శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 20: భీష్మఏకాదశి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం చినవెంకన్న క్షేత్రం భక్తజన సంద్రమైంది. భీష్మఏకాదశి సందర్భంగా ముందురోజు రాత్రికే పాదయాత్రగా వందలాదిమంది ఆలయానికి చేరుకున్నారు. దాదాపు 12,000 మందికి పైగా భక్తులు వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో పోటెత్తాయి. దర్శనానంతరం వారంతా శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

29లోగా పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

భీమవరంటౌన్, ఫిబ్రవరి 20: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లు (పెన్షనర్స్ వార్షిక వెరిఫికేషన్ సర్టిఫికెట్లు) సమర్పించడానికి ఈనెల 29 ఆఖరి తేది అని జిల్లా ఖజానా శాఖ అధికారి అడారి గణేష్ తెలిపారు. ప్రతి ఒక్క పెన్షనర్ తమ దగ్గరలోని ఉప ఖజానా కార్యాలయములో గాని, ఆన్‌లైన్‌లో గాని, స్థానిక పోస్టాఫీసులోగాని నెట్ సెంటర్లలో గాని సర్టిఫికెట్లు పొందవచ్చన్నారు. సర్టిఫికెట్ అందించని పెన్షనర్లకు మార్చినెల పెన్షన్ నిలుపుదల చేస్తామన్నారు. ఫ్యామిలీ పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లతోపాటుగా నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లు, నాన్ రీ-మ్యారేజ్ సర్టిఫికెట్లు సమర్పించాలని కోరారు.

'పశ్చిమ'లో బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవు : మురళీకృష్ణ

తణుకు, ఫిబ్రవరి 20 : పశ్చిమ గోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ ఆనవాళ్ళు లేవని, బర్డ్ ఫ్లూ పట్ల యంత్రాంగం అప్రమత్తంగా ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.మురళీ కృష్ణ తెలిపారు. మంగళవారం నెక్ కార్యాలయంలో జిల్లా పౌల్ట్రీ రైతులతో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎటువంటి అసాధారణ మరణాలు కోళ్లలో లేవని చెప్పారు. అప్రమత్తత అవసరమని ఆ దిశగా శాఖాపరంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు వదంతులు నమ్మవద్దని కోడి మాంసం, గుడ్లు అందరూ వినియోగించవచ్చని వివరించారు. సమావేశంలో జిల్లా నెక్ ఛైర్మన్ గుణీతి గంగాధరరావు, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, సెక్రటరీ ఆత్కూరి దొరయ్య, పౌల్ట్రీ రైతులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

కాల్వలో పడి వ్యక్తి మృతి

భీమడోలు, ఫిబ్రవరి 20 : గోదావరి కాల్వలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన భీమడోలులో మంగళవారం జరిగింది. జనపల నరసింహులు (50) అనే వ్యక్తి మద్యానికి బానిసై తరచూ ఇంట్లో చెప్పకుండా వెళ్ళిపోతూ ఉండేవాడని ఈనెల16వ తేదీన ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోగా అతడి కోసం కుమారుడు రంగారావు వెతుకుతుండగా 19వ తేదీ సాయంత్రం భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలో గోదావరి కాల్వలో శవమై తేలినట్టు గుర్తించారు. మద్యం మత్తులో తన తండ్రి కాల్వలో పడిపోయి ఉంటాడని మృతుని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉండి, ఫిబ్రవరి 20: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక బ్రాందిలో పురుగుల మందును కలుపుకుని తాగిన వ్యక్తి ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందాడు. ఉండి పోలీసులు తెలిపిన వివరాలివి.. వాండ్రం గ్రామానికి చెందిన రామిశెట్టి కిరణ్‌కుమార్(30) తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య దివ్య ఉంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఈనెల 15వ తేదీన బ్రాందిలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. సత్వరమే కుటుంసభ్యులు ఉండి ప్రభుత్వాసుపత్రికి అనంతరం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంగళవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్టు వీఆర్‌వో చిన్నారావు తెలిపారు. భార్య దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

పెదవేగి, ఫిబ్రవరి 20:తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు తాటిచెట్టుపైనుంచి పడి గీతకార్మికుడు మృత్యువాత పడ్డాడు. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలివి.. కూచింపూడికి చెందిన బెజవాడ రాంబాబు కల్లుగీత కార్మికుడు. సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కిన ప్రమాదవశాత్తు కిందకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరించారు. గీత కార్మికుడు బెజవాడ రాంబాబు అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పెంటపాడు పీహెచ్‌సీలో చోరీ యత్నం

పెంటపాడు, ఫిబ్రవరి 20 : పెంటపాడు పీహెచ్‌సీలో సోమవారం రాత్రి చోరీ యత్నం జరిగింది. పీహెచ్‌సీ ముందు తలుపు గెడను పగులకొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఆస్పత్రిలో చోరీ చేసేందుకు ప్రయత్నించారు. ఆసుపత్రిలో ఉన్న సామగ్రి, కాటన్, ఇంజక్షన్ సిరంజిలను తగులబెట్టారు. రికార్డులను తగుల బెట్టేందుకు యత్నించినట్టు పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు. దొంగిలించేందుకు ఏమీ లభించకపోవడంతో ఇటువంటి చేష్టలకు తెగబడినట్టు సిబ్బంది సందేహం వ్యక్తం చేస్తున్నారు. పెంటపాడు ఏఎస్ఐ ఉమా సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

వీరవాసరం, ఫిబ్రవరి 20 : మడుగుపోలవరం లంక గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో వీరవాసరం ఎస్ఐ పి.రమేష్ సిబ్బందితో దాడిచేశారు. ఓదులమ్మ పుంతలో జరుగుతున్న కోడి పందేలపై ఆకస్మిక దాడి చేసి రూ.1,520 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎనిమిది గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ఏలూరు క్రైం/ఉంగుటూరు, ఫిబ్రవరి 20:వాణిజ్య అవసరాలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ అధికారి కరణం కుమార్‌కు అందిన సమాచారంతో విజిలెన్సు అధికారులు ఓ హోటల్‌పై దాడి చేశారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో వున్న రాజ్‌విలాస్ రెస్టారెంట్‌పై విజిలెన్సు అధికారులు మంగళవారం దాడి చేసి తనిఖీలు చేసి ఎనిమిది గ్యాస్ సిలిండర్లను గుర్తించారు. హోటల్ యజమాని పోలా నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి, రూ.22,191 విలువైన గ్యాస్ సిలెండర్లను సీజ్ చేశామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

షాపుల్లో చోరీలు.. కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 20 : ఏలూరు కెనాల్‌రోడ్డులోని రెండు షాపుల్లో చోరీ జరిగినట్టు ఫిర్యాదు అందడంతో ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఏలూరు కెనాల్‌రోడ్డులో ఉన్న ఒక కంప్యూటర్ షాపు మరో షాపులను సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు పగులగొట్టారు. మంగళవారం ఉదయం వాటి యజమానులు వెళ్లి చూసేసరికి షాపులు చోరీకి గురయ్యాయి. కంప్యూటర్ షాపు నిర్వహిస్తున్న బొద్దూరి హరి ప్రసాద్ ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన షాపులోని మూడు ల్యాప్‌టాప్స్, మూడు బయోమెట్రిక్ డివైజర్లు, కొంత నగదు అపహరణకు గురైనట్టు పేర్కొన్నారు. పక్క షాపులో కూడా ఒక సెల్‌ఫోన్, కొంత నగదు అపహరణకు గురైనట్టు ఫిర్యాదు ఇవ్వడంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కరాటం రాంబాబు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 20: రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కాపు జేఏసీ ముందుకు వెళుతుందని అధ్యక్షుడు చందు జనార్దన్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు అధ్యక్షతన మంగళవారం కాపు జేఏసీ సమావేశం జరిగింది. చందు జనార్దన్ మాట్లాడుతూ 25 శాతం ఉన్న కాపు వర్గాలు రాజ్యాధికారం వైపు వెళ్లాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు వార్డు సభ్యుడి నుంచి పార్లమెంట్ సభ్యుడి వరకు కాపు వర్గాలకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కాపు బడ్జెట్ కేటాయించి కాపు కార్పొరేషన్ ద్వారా నిధులు ఖర్చు చేయాలని కోరారు. కరాటం రాంబాబు మాట్లాడుతూ ప్రతి కాపు యువకుడు ఉన్నత విద్యావంతుడుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్వయం శక్తితో వృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. జేఏసీ రాష్ట్ర నాయకులు ముత్యాల రామదాసు, నల్లా విష్ణు, వాసిరెడ్డి ఏసుదాసు, మంచాల సాయి సుధాకర్ నాయుడు, అచ్యుత శ్రీనివాసరావు, పొల్నాటి బాబ్జి, రావూరి కృష్ణ, కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు, విజ్జు వెంకట స్వామి నాయుడు, వామిశెట్టి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాతృ భాషతోనే విషయ పరిజ్ఞానం


ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20: మాతృభాషలో విద్యా బోధన విద్యార్థి మనోవికాసానికి తోడ్పడుతుందని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఏ విషయమైనా మాతృభాషలోనే త్వరగా ఆకళింపు చేసుకోగలరన్నారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలతో భాషలను, సంస్కృతిని ప్రతిబింబించే ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రోగ్రాం కోఆర్డినేటర్లు అరుణ, ఝాన్సీ, భవాని తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: వట్లూరు సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఋటావల్లభుల సాయిరామ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృభాష అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పిల్లలకు బాల్యం నుంచే మాతృభాష గొప్పతనం తెలియజేయాలన్నారు. ప్రిన్సిపాల్ శైలజ, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా పట్టిసీమ వీరేశ్వరస్వామి కల్యాణం



పోలవరం, ఫిబ్రవరి 20: పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వీరేశ్వరస్వామికి సుప్రభాత సేవ, లక్ష పత్రి పూజ, పంచామృత, భస్మార్చన, భస్మ, గంధాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం, రాత్రి కల్యాణ రాయబారం, శివ కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారని ఆలయ ఈవో ఎస్.సంగమేశ్వరశర్మ తెలిపారు.

రేపటి నుంచి రామకోటి మహోత్సవాలు


ఉత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 20: అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఈ నెల 22 నుంచి మార్చి 17 వరకు 92వ శ్రీరామ కోటి మహోత్సవాలు నిర్వహించనున్నారు. రామకోటి విశ్వశాంతి సమాజం గౌరవాధ్యక్షుడు కొట్టు మధు వెంకట్రావు, అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వేమా సురేష్‌కుమార్, కార్యదర్శి మానేపల్లి రామారావు, మారం అను మంగళవారం ఉత్సవాల వివరాలు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 8న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పార్థివ లింగాన్ని ఏర్పాటుచేసి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన జరుపుతామన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి పూజలు చేశారు. ప్రధాన అర్చకులు రామానుజాచార్యులు, కనిగొళ్ళ సురేష్ పూజా కార్యక్రమాలను జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయాల్లో భీష్మ ఏకాదశి పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ సామూహిక రమాసహిత వీర వెంకట సత్యనారాయణస్వామి వ్రతాలను మంగళవారం జరిపించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నగరంలోని ఆంజనేయస్వామి ఆలయాలు, రామాలయాలు, శ్రీవారి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అగ్రహారంలో జనార్దనస్వామి ఆలయం వద్ద సామూహిక పూజలు జరిపించారు. నరసింహారావుపేటలోని దాసాంజనేయస్వామి, అంబికా ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి, మినీ బైపాస్ రోడ్డు, పత్తేబాద అభయాంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

● కామవరపుకోట: మండలంలో ఆలయాల వద్ద మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక లలితా పీఠంలో శ్రీచక్రానికి భక్తులు పాలాభిషేకం నిర్వహించారు. తడికలపూడి గాంగేశ్వరస్వామి, రామాలయం, ఆడమిల్లి ఏకాంబరేశ్వరస్వామి, జీలకర్రగూడెం కోదండ రామాలయం, తూర్పు యడవల్లి, రావికంపాడు రామాలయాల వద్ద పూజలు, ఏకాదశి వ్రతాలు చేశారు.

● ఉంగుటూరు: భీష్మ ఏకాదశి సందర్భంగా కైకరం వేణుగోపాలస్వామి ఆలయంలో గీతామృత వాహిని సత్సంగ్, సీతారామ గీతార్చన భజన మండలి ఆధ్వర్యంలో గీతా పారాయణం నిర్వహించారు. ఆలయ అర్చకులు కిరణ్ స్వామి వారికి విశేష పూజలు చేశారు. గురువారం వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు యెగ్గిన శేషయ్య దొర, కొచ్చర్లకోట శ్రీనివాసరావు తెలిపారు.

● టి.నరసాపురం: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బొర్రంపాలెం, వీరభద్రవరం, శ్రీరామవరం, తిరుమలదేవిపేట గ్రామాల నుంచి భక్తులు కాలినడకన ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శనానికి వెళ్లారు.

అచ్చమ్మ పేరంటాల ఆలయం వద్ద భక్తుల రద్దీ

దెందులూరు, ఫిబ్రవరి 20: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. బుధవారం సినీ హీరో వరుణ్ తేజ్, ఆపరేషన్ వాలంటీన్ సినిమా బృందం అమ్మవారిని దర్శించుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రంగాపురంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

లింగపాలెం, ఫిబ్రవరి 20: రంగాపురంలో భూనీలా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా వ్రతాలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల పలు మండలాల నుంచి అధికసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన మద్ది ఆంజనేయస్వామి ఆలయం

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 20: మద్ది ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుఝామున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. టీడీపీ నాయకుడు బొమ్మాజీ అనిల్ స్వామి వారిని దర్శించుకున్నారు. సాయిల సత్యనారాయణ, రావూరి కృష్ణ, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు పాల్గొన్నారు

వేణుగోపాలస్వామికి లక్ష తులసి పూజ

పెదపాడు, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పెదపాడు రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేత్రపర్వం.. శ్రీవారి తిరువీధిసేవ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 20: తొళక్క వాహనంపై ఉభయదేవేరులతో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి మంగళవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తొళక్కంపై ఉంచి అలంకరించారు. అనంతరం మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ అట్టహాసంగా తిరువీధులకు తీసుకెళ్లారు. భక్తులు దేవతామూర్తులకు హారతులు పట్టారు.

అభివృద్ధి.. విధ్వంసంపై

చర్చకు సిద్ధమా..!

అధికార పార్టీ నేతలకు టీడీపీ శ్రేణుల సవాల్


జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయ శిలాఫలకాల వద్ద టీడీపీ నేతల సవాల్

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 20 : మాతో చర్చకు సిద్ధమా అంటూ అధికార పార్టీ నేతలకు టీడీపీ నేతలు సవాల్ విసిరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విధ్వంసంపై చర్చకు తాము సిద్ధం అంటూ టీడీపీ నాయకులు మంగళవారం జంగారెడ్డిగూడెంలో సవాల్ చేశారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాల వద్ద ప్రదర్శన చేశారు. ప్రస్తుత వైసీపీ పాలనలో అభివృద్ధి, టీడీపీ పాలనలో జరిగిన పనులపై మాట్లాడే దమ్ము ఉందా అని నిలదీశారు. టీడీపీ హయాంలో నిర్మించిన మున్సిపాలిటీ పరిపాలన భవనం వద్ద కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, కొంచాడ ప్రసాద్, కోలా శ్రీనివాస్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, పోసుబాబుతో కలసి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు సెల్ఫీ దిగి చాలెంజ్ విసిరారు.

● ఏలూరు టూటౌన్: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. నగరంలో కోట్ల రూపాయలతో టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేశామన్నారు. శనివారపుపేట వద్ద టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రోడ్డుపై సెల్ఫీ దిగి అధికార పార్టీ నేతలకు సవాల్ విసిరారు. చంటి మాట్లాడుతూ రూ.16 కోట్లతో శనివారపుపేట రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేశామన్నారు. తూర్పువీధిలో రూ.2 కోట్లు, కలెక్టరేట్ ప్రాంతంలో రూ.కోటితో రోడ్ల విస్తరణ పనులు చేపట్టామన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కోట్ల రూపాయలతో నగరంలో రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కరోడ్డు కూడా కొత్తగా వెయ్యలేదన్నారు. కనీసం గుంతలు పూడ్చిన పాపాన పోలేదన్నారు. కనీసం రోడ్లు వేయలేని ప్రభుత్వం ఏదైన ఉందంటే అది వైసీపీ అన్నారు. జనసేన, టీడీపీ కూటమిని గెలిపిస్తే నియోజకవర్గ రోడ్లకు పూర్వ వైభవం తెస్తామన్నారు.


టీడీపీ హయాంలో నిర్మించిన రోడ్డుపై బడేటి సెల్ఫీ

నియంత పాలనకు చరమగీతం పాడాలి : గన్ని


అడవికొలనులో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

నిడమర్రు, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో నియంతపాలనకు రానున్న ఎన్నికలలో చరమగీతం పాడాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. అడవికొలనులో మంగళవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ గద్దెనెక్కిన జగన్ నేడు వ్యవస్థలను నాశనం చేసి అన్ని రంగాలను అధోగతి పాలుచేశాడన్నారు. కంపెనీల నుంచి జె ట్యాక్స్ వసూలు చేసి ఆక్వారంగాన్ని సర్వనాశనం చేశాడన్నారు. ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాను పెంచిన పోషిస్తున్న జగన్ పాలనను అంతం చేసేవరకు పట్టుదలతో పనిచేయాలన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన కూటమి విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం మన ఇంటికి మన గన్ని కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షులు ముత్యాల స్వామి, పొశింశెట్టి రాంమూర్తి, పైడికొండల శివాజీ, ఆదిరెడ్డి చంద్రరావు, జనసేన నాయకులు ముత్యాల వాసు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్, గ్లాస్ గుర్తులంటే జగన్‌కు వణుకు

ఏలూరు టూటౌన్: సైకిల్, గ్లాస్ గుర్తులంటే జగన్ వణికిపోతున్నాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. నాలుగో డివిజన్ నాగేంద్ర కాలనీలో మంగళవారం ప్రజా సంకల్పయాత్ర నిర్వహించారు. వైసీపీ అరాచక పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు పేరు చెబితే పండుగ కానుకలు, నిరుద్యోగ భృతి, టీచర్ పోస్టుల భర్తీ, చంద్రన్న బీమా, సబ్సిడీ రుణాలు, సబ్ ప్లాన్, అమరావతి రాజధాని, పసుపు కుంకుమ గుర్తొస్తాయన్నారు. జగన్ పేరు చెబితే ఇసుక, మద్యం, మైనింగ్ మాఫియా, అధిక ధరలు, కక్షసాధింపు చర్యలు, బాబాయ్‌పై గొడ్డలివేటు గుర్తుకొస్తాయన్నారు. వైసీపీ పాలనలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని చంటి అన్నారు. కార్యక్రమంలో అమరావతి అశోక్, సురేష్, లాలా లజపతిరాయ్, కొండలరావు, జిలాని, వీరయ్య, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణమస్తు, షాదీ తోఫా నిధులు జమ


నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20: జిల్లాలో వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా లబ్ధిదారులు 477మంది ఖాతాల్లో రూ. 3.52 కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. తాడేపల్లి నుంచి మంగళవారం సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బటన్‌నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఆర్డీవో ఎన్.ఎస్.కె ఖాజావలీ, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా మొత్తం 437మంది జట్లకు రూ.3.52 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు.

సుందరీకరణ పనులు పరిశీలన

ఏలూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో సుందరీకరణ పనులను కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ మంగళవారం తనిఖీ చేశారు. తంగెళ్ళమూడి నాలుగురోడ్ల సెంటర్లో వాటర్ ఫౌంటెన్, ఇతర నిర్మాణ పనులను పరిశీలించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ ఉన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 20: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులను ఆదేశించారు. తంగెళ్ళమూడి రజకుల పేట వద్ద, శనివారపుపేట సచివాలయాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. జిల్లాలో 75,447 మంది లబ్ధిదారుల్లో 56,454 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు రిజిస్ట్రేషన్లు పనులను వేగవంతం చేయాలన్నారు.

వలంటీర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

జిల్లాలోని 28 మండలాల్లో చెందిన గ్రామ, వార్డు వలంటీర్ 164 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. అర్హులైన, ఆసక్తి కలవారు ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తులు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. రిజర్వేషన్ కేటగిరీ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 21 నుంచి 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా ప్రదర్శన


బస్టాండ్ సెంటర్‌లో కళాజాత ప్రదర్శన

పెదపాడు, ఫిబ్రవరి 20: ఎయిడ్స్ మహమ్మారిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి చక్రధర్ తెలిపారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం కళాజాత ప్రదర్శన మంగళవారం జరిగింది. ఎయిడ్స్ అవగాహన కల్పిస్తూ కళాజాత బృంద సభ్యులు వీధి నాటికలను ప్రదర్శించారు. అనంతరం వైద్యసిబ్బందితో కలిసి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మణిపాల్, కళాజాత సభ్యులు కుమార్, తిరుపతి, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ చట్టంపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 20: సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానత లేకుండా సామాజిక న్యాయ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్ అన్నారు. ఎస్ఆర్‌పేట ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. ప్యానల్ అడ్వకేట్ కూన కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక బాధ్యతతో ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: న్యాయం దృష్టిలో అందరూ సమానమేనని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బండారు లతా కుమారి, వామిశెట్టి హిమబిందు, హెచ్‌ఎం లోవకుమారి పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో మేలైన దిగుబడులు


లింగాకర్షక బుట్టలతో రైతులు, అధికారులు

పెదవేగి, ఫిబ్రవరి 20: సమగ్ర సస్యరక్షణ చేపడితే మేలైన దిగుబడులను పొందవచ్చని ఏవో ఎం.ప్రియాంక అన్నారు. అమ్మపాలెం, పెదకడిమి గ్రామాల్లో మొక్కజొన్న సాగు, సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ విభాగం, ప్రకృతి వ్యవసాయ బృందం భాగస్వామ్యంతో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, ఎరువులు, పురుగుమందుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో ప్రియాంక మాట్లాడుతూ పరిమితికి మించి ఎరువులు, పురుగు మందులు వాడితే పంట నాణ్యత తగ్గడంతో పాటు భూమి ఉదజని సూచిక దెబ్బతింటుందన్నారు. రైతులకు సమగ్ర సస్యరక్షణ కిట్లు అందించారు. లింగాకర్షక బుట్టలు, పురుగుమందుల వాడకంపై సూచనలు చేశారు. విజయవాడ కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారులు సురేష్, డాక్టర్ దక్షిణామూర్తి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం క్షేత్రాల పరిశీలన


ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో అధికారులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 20: ప్రకృతి వ్యవసాయంలో రైతులు తీసుకుంటున్న జాగ్రత్తలపై కేంద్ర అటల్ భుజల్ యోజన అధికార బృందం పరిశీలించింది. వెల్లమిల్లిలో మంగళవారం అధికారుల బృందం పర్యటించింది. మండలంలో రసాయనాలు వాడిన క్షేత్రం, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఈ బృందం పరిశీలించింది. రసాయనం వాడిన క్షేత్రంలో ప్రతి మూడు రోజులకు తడులు పెడుతున్నారని, ప్రకృతి క్షేత్రంలో ఏడు రోజులకు తడి పెడుతున్నారని సంబంధిత రైతు పరిమి రాజేంద్రప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో అటల్ భుజల్ యోజన డైరెక్టర్ రాఘవ, విశ్రాంత అధికారి ఆనంద్‌పాల్, పీడీసక్సేనా, ప్రత్యేక వ్యవసాయాధికారి కుమావత్, వల్లి, డీపీఎం తాతారావు, అరుణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల తనిఖీ

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. జిల్లాలో మార్చి 1 నుంచి 20 వరకు థియరీ పరీక్షలు నిర్వహించనున్న 51 కేంద్రాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ఏలూరు డీవీఈవో కార్యాలయంలో సెంట్రల్ కమాండ్ సెంటర్ నుంచి ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా పరీక్షించారు. థియరీ పరీక్షల నిర్వహణ తనిఖీ నిమిత్తం జిల్లాలో 2 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్టు డీవీఈవో ప్రభాకరరావు తెలిపారు. ఒక్కో స్క్వాడ్ బృందంలో పోలీసు, రెవెన్యూ, ఇంటర్ బోర్డుల నుంచి ముగ్గురు చొప్పున అధికారులు ఉంటారని వివరించారు. మంగళవారం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు జిల్లాలో 387 మంది హాజరు కావాల్సి ఉండగా 385 మంది హాజరయ్యారని డీవీఈవో వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు పెరిగిన వేతనాలు చెల్లింపు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20: సమగ్రశిక్ష జిల్లాప్రాజెక్టులో 2019 నుంచి పనిచేస్తూ ఇంతవరకు జీతాల పెంపుదల వర్తించని ఉద్యోగులందరికీ 23 శాతం పెరిగిన వేతనాలను చెల్లించనున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి పెరిగిన వేతనం చెల్లించేలా మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయని డెమొక్రటిక్ పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. కేడర్ల వారీగా పెరిగిన వేతనాల వివరాలను ఉన్నతాధికారులు విడుదల చేశారన్నారు. తాజా ఉత్తర్వులతో ఉమ్మడి జిల్లాలో సుమారు 760 మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు.

నాయీబ్రహ్మణ సేవా సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా అనంతలక్ష్మి

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 20: నాయీబ్రాహ్మణ సేవా సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా బయ్యన్నగూడెం సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆమెను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి సత్యనారాయణ, మంగళవారం తెలిపారు. అనంతలక్ష్మి మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతలక్ష్మి నియామకంపై పలువురు నాయీబ్రహ్మణ నాయకులు అభినందించారు.

రెండు ఆటోలు ఢీ : నలుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటోలు

పోలవరం, ఫిబ్రవరి 20: కొత్త పట్టిసీమ వద్ద మంగళవారం రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలవరం నుంచి తాళ్ళపూడి వెళుతున్న ఆటోలో పోలవరం బెస్తావీధికి చెందిన ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు ఎస్‌కె వలీ, బొట్టా శ్రీను ఎక్కారు. గూటాల, కొత్తపట్టిసీమ మధ్య చేపల దుకాణాల సమీపంలో ఉల్లిపాయల ట్రక్ ఆటో వేగంగా ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఆటో వెనుక మోటార్ బైక్‌ను కూడా ఢీకొంది. కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన తైలం దుర్గాప్రసాద్ బైక్‌తో సహా కిందపడిపోయాడు. దుర్గాప్రసాద్, అతడి కుమార్తె, బోల్తాపడిన ఆటోలో ప్రయాణిస్తున్న కొయ్యలగూడెం మండలం గవరవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చాపల సుధీర్, భవన నిర్మాణ కార్మికులు వలీ, బొట్టా శ్రీను తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలవరం ఆసుపత్రికి తరలించగా డాక్టర్ సతీష్ కుమార్ ప్రథమ చికిత్స అందించి దుర్గాప్రసాద్, అతడి కుమార్తె, బొట్టా శ్రీను, సుధీర్‌ను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేశారు. ట్రక్ ఆటో డ్రైవర్ పరారయ్యాడని స్టేషన్ రైటర్ శ్రీనివాస్ తెలిపారు.

నేడు జనసేన ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

చింతలపూడి, ఫిబ్రవరి 20: మండలంలో సమస్యల పరిష్కారం కోరుతూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం చింతలపూడి పాతబస్టాండ్‌లో రెండు రోజులపాటు రిలే సామూహిక నిరాహార దీక్ష చేపట్టనున్నారు. జనసేన మండల అధ్యక్షుడు చీదరాల మధుబాబు, టి.నాగ విజయకుమార్ మంగళవారం ఏర్పాట్లు పరిశీలించారు. ఐదేళ్లుగా మండలంలోని రోడ్లకు కనీసం మరమ్మతులు చేపట్టలేదని, ప్రమాదాల బారిన పడి పలువురు మరణించారని, అయినా ప్రభుత్వంలో చలనంలేదన్నారు. చింతలపూడిని నగర పంచాయతీ చేసి నాలుగేళ్లు కావస్తున్నా కనీస సౌకర్యాలు లేవన్నారు. పాత బస్టాండ్‌లో సులభ్ కాంప్లెక్స్‌గాని, డ్రెయినేజీలు, తదితర ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. పట్టణంలో డ్రెయినేజీ సౌకర్యం లేక రోడ్లన్నీ గోతులు పడ్డాయన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దీక్షలు చేపట్టామని, నియోజకవర్గ జనసేన కన్వీనర్ మేకా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఈ దీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

టీచర్లు అంకితభావంతో పనిచేయాలి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20: టీచర్లు అంకితభావంతో విధులు నిర్వర్తించినపుడే సత్ఫలితాలు వస్తాయని సమగ్రశిక్ష ఏపీసీ బి.సోమశేఖర్ అన్నారు. సత్రంపాడు జడ్పీ హైస్కూలులో ప్రాథమిక పాఠశాల టీచర్లకు జరుగుతున్న ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీషు, హిందీ సబ్జెక్టుల కాంప్లెక్స్ సమావేశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న వివిధ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠ్యాంశాలపై టీచర్లను ప్రశ్నించారు. 'సాల్ట్' పథకం, టీచర్ టూల్ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు తేవాలన్నారు. ఆయన వెంట ఏఎంవో ఆర్.రామారావు తదితరులు ఉన్నారు.

బోధనోపకరణాలతో అర్థవంతమైన బోధన


బోధనోపకరణాలతో ఉపాధ్యాయులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 20: బోధనోపకరణాల ద్వారా బోధన అర్థవంతంగా సాగుతుందని ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు అన్నారు. ఉంగుటూరు ఉన్నత పాఠశాలలో ఆంగ్లం సబెక్టుపై స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మంగళవారం నిర్వహించారు. సమగ్రశిక్షా అభియాన్ వారిచే ప్రత్యక్ష బోధన, టోఫెల్ అంశాలపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ అప్పారావు, కాంప్లెక్స్ కార్యదర్శి మనోజ్, రంగవల్లి సోమేశ్వరరావు, భారతి, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** ఇటీవల భీమవరంలో జరిగిన అంతర్జాతీయ చదరంగం పోటీల్లో ఏలూరు అమలోద్భవి స్కూల్ చిన్నారులు అభిషేక్ అనురూప్ మోషే అండర్ -7 విభాగంలో రెండోస్థానం సాధించారు. విజేతలను జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అభినందించారు.
- స్థానిక 43వ డివిజన్‌కు చెందిన ఆర్.వంశీకృష్ణ ఇటీవల జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో బ్యాడ్మింటన్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించాడు. వంశీకృష్ణ ఎమ్మెల్యే ఆళ్ల నాని అభినందించారు.
- **చింతలపూడి :** మల్లాయిగూడెం, రాఘవాపురం, యర్రగుంటపల్లి, సీతానగరం, తిమ్మిరెడ్డిపల్లి, ప్రగడవరం, వెలగలపల్లి, యర్రంపల్లి గ్రామాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలను ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- **పెదపాడు :** అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో 200 మందికి అన్న సమారాధన చేసినట్లు ఆలయ ఇవో కూచిపూడి శ్రీనివాస్, చైర్మన్ నెర్సు భూషణం తెలిపారు.
- **టి.నరసాపురం :** టి.నరసాపురం 33కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు టి.నరసాపురం, గుర్వాయిగూడెం, తిరుమలదేవీపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తిరుమలదేవీపేట, శ్రీరామవరం, ఏపిగుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ రాధాకృష్ణ తెలిపారు.
- **ఉంగుటూరు :** గొల్లగూడెం శివాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 160 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు.
- **భీమడోలు :** బీజేపీ మండల కార్యవర్గం వెజ్జు ధర్మారావు ఆధ్వర్యంలో ఏర్పాటైంది. అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్‌పటేల్, ఉపాధ్యక్షులుగా భాస్కరరావు, జల్లా సత్తిబాబు, దాని సుబ్బారావు, నీలం గోపాలం, పార్థసారథి, చీమల చిన్నారావును ఎన్నుకున్నారు.

ఓటు వేయడం పౌరుల బాధ్యత


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో ఖాజావలి

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 20: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని, ఓటు నమోదు చేసుకోవడంతో పాటు ఓటు వేయడం ప్రతి ఓటర్ బాధ్యత అని ఆర్డీవో ఎన్.ఎస్.కె ఖాజావలీ అన్నారు. స్వీప్ కార్యక్రమం ద్వారా దివ్యాంగుల ఓటు నమోదు, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం జిల్లా ప్రతిభావంతుల సంక్షేమశాఖ అధికారి రాకాడ మణి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఆర్డీవో మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటు వినియోగించుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకుందన్నారు. దివ్యాంగులు సులభతరంగా ఓటు నమోదు, పోలింగ్‌రోజున ప్రత్యేక ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి సీఈసీ, దివ్యాంగుల్లో చైతన్యం కలిగించి ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుందన్నారు. కేంద్రాలకు రాలేని దివ్యాంగులను గుర్తించి ఇంటివద్ద నుంచే ఓటువేసే విధంగా ఏర్పాట్లు చేశారని తెలిపారు. సమగ్రశిక్షా అభియాన్ పీవో బి.సోమశేఖర్, స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, గిరి, దివ్యాంగులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఎన్నికల సిబ్బంది నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఖాజావలి కోరారు. ఎన్నికల సిబ్బందికి నారాయణపురంలో తొలి విడత శిక్షణ మంగళవారం నిర్వహించారు. ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్ఐలకు మాస్టర్ ట్రైనీలతో శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నియమావళిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఖాజావలి కోరారు.

● చింతలపూడి: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ బూత్‌లో సౌకర్యాలు, ఓటర్ జాబితాలో పేర్లు చేర్పులు, మార్పులు సిద్ధం చేయాలని సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూత్‌ల పరిధిలో 80 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగుల సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. మండలంలోని బీఎల్వోలు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రి నిర్మలకు పాత్రికేయుల వినతిపత్రం


కైకలూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు..


ముసునూరులో మాట్లాడుతున్న జనసేన నాయకులు

దాడులతో పత్రికాస్వేచ్ఛను హరించలేరు

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్టుపై వైసీపీ నాయకుల మూకుమ్మడి దాడి అత్యంత దారుణం.. అని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు ఖండించారు. ఈ మేరకు మంగళవారం కూడా ఆందోళనలు నిర్వహించి తహసీల్దార్ కార్యాలయాల వద్ద అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

జర్నలిస్టులకు రక్షణ కల్పించండి : ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

పెదవేగి, ఫిబ్రవరి 20 : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన నిందితులను తక్షణం అరెస్టుచేసి, కఠినంగా శిక్షించాలని కోరుతూ దెందులూరు నియోజకవర్గం ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన సీఐ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ మీడియా రంగంలో పనిచేస్తున్న వారికి రక్షణ కల్పించడానికి అన్నిచర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ నాయకుల ఖండన

కైకలూరు, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన దోషులను పోలీసులు తక్షణమే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు డిమాండ్ చేశారు. మంగళవారం కైకలూరు టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం బహిరంగ సభలో వైసీపీ అల్లరిమూకలు ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి హేయమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయాలకతీతంగా నడిచేది పత్రికా రంగమేనని వారు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేస్తారన్నారు. గతంలో నక్సల్స్‌కు ప్రభుత్వానికి మధ్య వారధిలా నడిచి అనేక సమస్యలను పరిష్కరించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. సిద్ధం సభలో మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే మీపై దాడులు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారని ప్రజలంతా దీనిని గమనించాలన్నారు. టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వర రాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యులు విజయలక్ష్మి, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, గుజ్జల రామలక్ష్మీ, పార్టీ సీనియర్ నాయకుడు వేములపల్లి కారుణ్య, ఎస్సీ సెల్ నాయకులు తేరా రమేష్ బాబు, కురేళ్ల ఇస్సాక్, కుర్మా నవీన్, పళ్లెం తాతారావు, వీరాబత్తిన సుధా, వాసిపల్లి సతీష్‌కన్నా తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమ్మిలి విఠలరావు పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి: ప్రెస్‌క్లబ్

చాట్రాయి: రాప్తాడులో సీఎం జగన్ సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి తెగబడిన దోషులను కఠినంగా శిక్షించాలని స్థానిక ప్రెస్‌క్లబ్ సభ్యులు మంగళవారం ఎంపీడీవో మంగాకుమారికి, తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. దోషులు ఎంతటివారైనా శిక్షించాలన్నారు. పాత్రికేయులు ఎన్ కృష్ణారావు, డీ శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాస్, పుల్లారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి హేయం : జనసేన

ముసునూరు: ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకుల దాడిని సెంట్రల్ ఆంధ్రా జనసేన కమిటీ సభ్యుడు పాశం నాగబాబుతో పాటు జనసేన నాయకులు మంగళవారం ఖండించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ రాప్తాడు సిద్ధం బహిరంగ సభలో ఫొటో కవరేజ్‌కు వెళ్ళిన సీనియర్ జర్నలిస్ట్, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడిచేయటం దారుణమన్నారు. తక్షణమే కృష్ణపై దాడిచేసిన వారిని పోలీసులు గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి

ఆచంట/పెనుగొండ, ఫిబ్రవరి 20: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన వైసీపీ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఆచంట నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం పెనుగొండ విచ్చేసిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వైసీపీ అల్లరి మూకలపై తక్షణం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు జక్కంశెట్టి శ్రీనివాసరావు, గుర్రాల శ్రీనివాసరావు, షణ్ముఖ్, వనం సత్యనారాయణ, అబ్రహం, మోహనరావు, విజయ కుమార్, పాలా కుమార్, రాజశేఖర్, ఉపేంద్ర, సుబ్బరాజు, రాంబాబు, పునులూరి శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడులకు ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆందోళన

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 20 : విధి నిర్వహణలో భాగంగా ఎన్నికల సభలకు, రాజకీయ పార్టీల కార్యక్రమాలకు హాజరవుతున్న జర్నలిస్టులపై ఇటీవల దాడులు పెరిగిపోయాయని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలోను, పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

జర్నలిస్టుపై దాడి దారుణం : సోమసుందర్

తాడేపల్లిగూడెం అర్బన్: రాప్తాడులో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి దారుణమని ఐజే యూ జాతీయ కార్యదర్శి సోమసుందర్ అన్నారు. దాడిని ఖండిస్తూ తాడేపల్లిగూడెం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పాత్రికే యులు నిరసన తెలిపారు.


చాట్రాయి ఎంపీడీవోకు పాత్రికేయుల వినతిపత్రం

బాల్ బ్యాడ్మింటన్‌లో వైవీఎన్నార్ ద్వితీయం



కైకలూరు, ఫిబ్రవరి 20: కృష్ణా వర్సిటీ ఇంటర్ కాలేజ్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించగా మంగళవారం కళాశాలలో వారిని అభినందించారు. ఈ నెల 19న విజయవాడ నలందా డిగ్రీ కళాశాలలో జరిగిన ఫైనల్స్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించారు. వీరిలో యూనివర్సిటీ స్థాయి పోటీలకు పి. కార్తిక్, సీహెచ్ పవన్‌కుమార్, ఎం. సంపత్ అర్హత సాధించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయప్రకాష్, ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్ బాలబాబు, అధ్యాపకులు డాక్టర్ ఎం. హరిబాబు, నున్న శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ మన్నె శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మర్రెడ్డిపై హత్యాయత్నం దారుణం

చాట్రాయి, ఫిబ్రవరి 20: ఏపీ తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై దుండగులు కత్తులతో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడటం దారుణమని నియోజకవర్గ తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి మందలపు జగదీష్ తీవ్రంగా ఖండించారు. వైసీపీ పాలనలో ప్రతిపక్ష పార్టీల నాయకులకు రక్షణ కరువైందని, ఓటమి భయంతో ఇటువంటి దురాగతాలకు పాల్పడటం హేయమని, ఈ దుశ్చర్యకు పాల్పడిన దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని జగదీష్ డిమాండ్ చేశారు.

త్వరలో ఆసుపత్రి నూతన భవనం ప్రారంభం



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 20: నూజివీడు ఏరియా ఆసుపత్రి నూతన భవనాలను త్వరలో ప్రారంభించనున్నట్టు నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌అప్పారావు అన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రి నూతన భవనాలను ఆయన మంగళవారం ఏరియా ఆసుపత్రి వైద్యసిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవనాలు, పరికరాలు అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం

చాట్రాయి, ఫిబ్రవరి 20: సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమని నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఐదుగురికి సేవారత్న, 285 మందికి సేవామిత్ర సర్టిఫికెట్లు అందజేశారు. సేవారత్నకు రూ 30 వేలు, సేవా మిత్రకు రూ. 15 వేలు చొప్పున పారితోషకం వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ నిర్మల, ఎంపీడీవో మంగా కుమారి, నాయకులు బాబ్జీ, ప్రసాద్‌బాబు, సుబ్బారెడ్డి, జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేలా కృషి చేస్తున్న వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం ముసునూరు ఎంపీడీవో కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ఇద్దరు వలంటీర్లకు సేవావజ్ర, ఐదుగురు వలంటీర్లకు సేవారత్న, మిగిలిన 290 మంది వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలను అందజేసి ఎమ్మెల్యే సత్కరించారు. ఎంపీపీ కొండా దుర్గాభవానీ, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీలు కోటగిరి రాజా, పాముల గంగాధర్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షులు మూల్పూరి నాగమల్లీశ్వరరావు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి

చాట్రాయి, ఫిబ్రవరి 20: ప్రధాని మోదీ పాలనలో అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతోందని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. మంగళవారం జబర్దస్త్ టీం, సినీ గాయకుల బృందం చనుబండ, చిన్నంపేట, చాట్రాయి, మర్లపాలెం గ్రామాల్లో మోదీ ప్రభుత్వం అభివృద్ధిపై ప్రచారం నిర్వహించారు. మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, తపన ఫౌండేషన్ ద్వారా 16 ఏళ్ళుగా గారపాటి చౌదరి చేస్తున్న సేవా కార్యక్రమాలపై జబర్దస్త్ కళాకారులు వివరించారు. సినీ గాయకుల పాటలు స్థానికుల్లో ఉత్సాహం నింపాయి. బీజేపీ నాయకులు రాజా, శ్రీకర్, శర్మ, చెన్నారావు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ

ముదినేపల్లి, ఫిబ్రవరి 20 : ముదినేపల్లిలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహంలో మంగళవారం దాతలు కోన పవన్ దంపతులు స్టడీ మెటీరియల్ విరాళంగా అందజేశారు. పదవ తరగతి విద్యార్థులు పుస్తకాలు, ఇతర మెటీరియల్‌తోపాటు పరీక్షలకు అవసరమైన సామగ్రిని అందజేసి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా శ్రద్ధ చూపాలని కోరారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.సురేష్ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

ముసునూరు, ఫిబ్రవరి 20: మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని ముసునూరు పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని బలివే గ్రామానికి చెందిన యార్లగడ్డ దుర్గారావు గోపవరం ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 17 మద్యం సీసాలను తీసుకు వెళుతున్న క్రమంలో ఎస్సై పి.వాసు తన సిబ్బందితో కలిసి దాడిచేసి పట్టుకున్నారు. ప్రభుత్వ దుకాణంలో ఎక్కువ సంఖ్యలో మద్యం సీసాలను కొనుగోలుచేసి గ్రామంలో అధికరేటుకు దుర్గారావు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. రూ.2,430లు విలువగల 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొల్లేరులో అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు


పందిరిపల్లిగూడెంలో కొల్లేరును పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

▸ విజిలెన్స్ డీఎఫ్ఓ శాస్త్రి ▸ కొల్లేరు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు

కైకలూరు, ఫిబ్రవరి 20: కొల్లేరు అభయారణ్య పరిధిలో ఎక్కడ అక్రమ తవ్వకాలు చేపట్టినా వన్యప్రాణి అభయారణ్య చట్టపరిధిలో కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ డీఎఫ్‌వో శాస్త్రి హెచ్చరించారు. మంగళవారం కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం, శృంగవరప్పాడు, వడ్లకూటితిప్ప, చటాకాయ, మండవల్లి మండలంలో పులపర్రు, కొవ్వాడలంక తదితర గ్రామాల్లో అటవీ శాఖ ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుంటూరు విజిలెన్స్ టీం, రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్, విశాఖ అటవీశాఖ సిబ్బందితో కలిసి కొల్లేరులో పర్యటించినట్లు వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వో ఎం. హిమశైలజ తెలిపారు. ఇటీవల కొల్లేరు అభయారణ్య పరిధిలో అక్రమ చేపల చెరువుల తవ్వకాలు జరుగుతున్నట్లు అందిన ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్య పరిధి చుట్టూ సుప్రీంకోర్టు సాధికార కమిటీ నిబంధనల ప్రకారం అక్రమ చేపల చెరువులు, రొయ్యల చెరువులు తవ్వకూడదని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.


పెదపాలపర్రులో ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న కామినేని

సుపరిపాలనను తీసుకొద్దాం : కామినేని

ముదినేపల్లి, ఫిబ్రవరి 20 : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించి ప్రజలకు సుపరిపాలనను తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. పెదపాలపర్రులో మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి అధ్యక్షతన జరిగిన సభలో కామినేని మాట్లాడుతూ వైసీపీ పాలనపై అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, పేదల అభ్యున్నతికి వైసీపీ పాలనను అంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రస్తుత పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు పూల రామచంద్రరావు, మాల్యాద్రి, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు కోటప్రోలు కృష్ణారావు, దావు నాగరాజు, బొంగు రవికుమార్, వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఆత్మీయ ర్యాలీ..

ముదినేపల్లిలో మంగళవారం సాయంత్రం కామినేని ఆత్మీయ ర్యాలీ కోలాహలంగా జరిగింది. టీడీపీ, బీజేపీ నాయకులతోపాటు పలువురు కామినేని అభిమానులు పాల్గొన్న ఈ ర్యాలీ సింగరాయిపాలెం నుంచి పెదపాలపర్రు వరకు నిర్వహించారు. టీడీపీ నాయకులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, యెర్నేని కిషోర్, వీరమల్లు నరసింహారావు, వీరమల్లు సత్యనారాయణ, పరసా విశ్వేశ్వరరావు, పరసా ఏడుకొండలు, దావు నాగరాజు, బొంగు రవికుమార్, దారం సుధ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముదినేపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కామినేని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం అభివృద్ధిని కాంక్షించే పాలన జరగటం లేదని, స్వార్థ రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు.



ఎన్‌ఆర్ఐ కళాశాలలో యోగా శిబిరం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 20: స్థానిక ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో భారత స్వాభిమాన్ ట్రస్ట్, యువభారత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం యోగా శిబిరం నిర్వహించారు. భారత స్వాభిమాన్ ట్రస్ట్ చీఫ్ జనరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ స్వామిపరమర్థ్ దేవి, యువభారత్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ స్వామిరిత్ దేవి విద్యార్థులతో యోగా సాధన చేయించారు. వ్యాయామ క్రీడలతో పాటు యోగాసాధన కూడా అవసరమని కళాశాల పీడీ డాక్టర్ పి.గౌత్ తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కె.రాగ సాయి పాల్గొన్నారు.

ఉచిత ఫిజియోథెరపీ



ముసునూరు, ఫిబ్రవరి 20: మండలంలోని రమణక్క పేట ఎంపీపీ పాఠశాలలోని భవిత సెంటర్లో మంగళవారం దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రశాంతి చికిత్స చేసి వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐఈఆర్టీలు, డీఎంపీ లక్ష్మీనారాయణరావు, జె.నాగమల్లీశ్వరి, హెచ్ఎమ్ లోకరాజు తదితరులు పాల్గొన్నారు.


ద్వారంపూడి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న అగ్నికుల క్షత్రియులు

ఎమ్మెల్యే ద్వారంపూడి దిష్టిబొమ్మ దహనం

కలిదిండి, ఫిబ్రవరి 20 : తమను కించపరిచే విధంగా కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారంటూ అగ్నికుల క్షత్రియులు మంగళవారం మట్టగుంటలో ధర్నా నిర్వహించారు. అనంతరం ద్వారంపూడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియుల ఓట్లతో గెలిచి అదే సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడటం దారుణమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించి ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డితో క్షమాపణ చెప్పించాలని లేకుంటే తగిన గుణపాఠం చెబుతామన్నారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు కొప్పనాతి విష్ణు, మోకా వెంకట రమణ, కొప్పనాతి లక్ష్మీనారాయణ, పొన్నాల తాతారావు, తిరుమలశెట్టి సత్యనారాయణ, వాతాడి రాంబాబు, బొమ్మిడి కాసులు, తిరుమలశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞానసదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారిణి లక్ష్మి

అందరికీ సమ న్యాయం జరగాలి

కైకలూరు, ఫిబ్రవరి 20: ఎలాంటి వివక్ష, తారతమ్యం లేకుండా ప్రజలందరికీ సమన్యాయం జరగాలని కైకలూరు సీనియర్ న్యాయసేవాధికారిణి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయదినోత్సవాన్ని పురస్కరించుకొని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కైకలూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారిణి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలను తెలుసుకుంటే తమ జీవితంలో ఎప్పుడు ఏ సమస్య వచ్చినా పరిష్కరించుకునేందుకు సాధ్యపడుతుందన్నారు. న్యాయవాదులు పి. పవన్‌కాంత్, జి. శివప్రసాద్, హెచ్ఎం జి. అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత తాగునీరు



కైకలూరు, ఫిబ్రవరి 20: కైకలూరు ప్రజలకు సురక్షితమైన తాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంటామని డివిజనల్ లెవల్ డెవలప్ మెంట్ అధికారిణి ఏబీపీవీ లక్ష్మి అన్నారు. మంగళవారం కైకలూరు భవానమ్మ చెరువు వద్ద ఉన్న ఆర్వో ప్లాంట్‌ను, తాలుకా సెంటర్ వద్ద ఉన్న సులాబ్ కాంప్లెక్స్‌ను ఆమె పరిశీలించారు. స్పందనలో బీజేపీ నాయకుడు కీర్తి వెంకట రాంప్రసాద్ చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆమె కైకలూరులో పరిశీలన చేశారు. సులాబ్ కాంప్లెక్స్‌ను ఆదునీ కరించి పంచాయతీ ద్వారా నిర్వహించాలని సూచించారు. అలాగే ఆర్వో ప్లాంట్‌పై కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని, ఆయన ఆదేశాల మేరకు మరమ్మతుల నిర్వహణ జరుగుతుందని తెలిపారు. ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు, ఈవోపీఆర్డీ రవిశంకరరావు, పంచాయతీ కార్యదర్శులు జి. వెంకటేశ్వరరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి : డీఈవో



ముదినేపల్లి, ఫిబ్రవరి 20 : పదవ తరగతి పరీక్షల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతాన్ని గణనీయంగా పెంచేందుకు ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో కార్యచరణ రూపొందించి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం కోరారు. మంగళవారం ముదినేపల్లి జడ్పీ హైస్కూల్‌లో జరిగిన వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది కంటే పరీక్షా ఫలితాలు మెరుగ్గా ఉండేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. ఇతర తరగతుల్లో కూడా విద్యాబోధన మెరుగుపర్చాలని చూడాలన్నారు. పదవ తరగతిలో చదువుల్లో కేటగిరీల వారీగా విద్యార్థులను పరిగణలోకి తీసుకుని తక్కువ సామర్థ్యం కలిగిన విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కాంప్లెక్స్ సమావేశాల్లో కార్యాచరణ పథకాలను రూపొందించి వాటిని అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.సమావేశాలకు ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరవ్వాలన్నారు. ఎంఈవో నరేష్ కుమార్, హైస్కూల్ హెచ్ఎం విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరస్వామి ఉత్సవాలకు ఏర్పాట్ల పరిశీలన



కలిదిండి, ఫిబ్రవరి 20 : శివరాత్రి సందర్భంగా నిర్వహించే పాతాళ భోగేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు విచ్చేసే భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని దేవదాయ, ధర్మదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ సీహెచ్. రంగారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామిని దర్శించుకుని ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ఈవో శింగన పల్లి శ్రీనివాసరావు, సొసైటీ ఛైర్మన్ వడుపు రామారావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

నేడు పెద్దింటమ్మ జాతరపై సమీక్ష



కైకలూరు, ఫిబ్రవరి 20: కొల్లేటికోట పెద్దింటి అమ్మవారు జాతర మహోత్సవాలపై ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి అధికారులతో సమీక్షా సమావేశాలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి కేవీ గోపాలరావు మంగళవారం తెలిపారు. బుధవారం మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద జాతర కమిటీ ఛైర్మన్, ఆర్డీవో ఎన్ఎస్‌కె ఖాజావలి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర మహోత్సవాలను వచ్చే నెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రేపు శాంతి కల్యాణం

కైకలూరు, ఫిబ్రవరి 20: శ్రీశ్యామలాంబ ఆలయంలో కొలువైయున్న శ్రీరామేశ్వర, రామలింగేశ్వరస్వామి వార్ల శాంతి కల్యాణోత్సవాలను ఈ నెల 21, 22, 23వ తేదీలలో త్రయాహినిక దీక్షతో నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి వీఎన్‌కె శేఖర్ మంగళవారం తెలిపారు. 22వ తేదీ గురువారం సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారి కళామండపం వద్ద స్వామివార్ల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణం



ముసునూరు, ఫిబ్రవరి 20: ముసునూరులో వేంచేసివున్న శ్రీ ప్రసన్న లక్ష్మీ నరసింహ స్వామి తిరుకల్యాణం సోమవారం రాత్రి 12.01 గంటలకు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం లక్ష్మీనరసింహాచార్యుల వేద మంత్రాలతో 9 జంటలు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణం జరిపించా రు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేయగా, భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించడంతో పాటు అన్నప్ర సాదం స్వీకరించారు. మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు.

కాల్వల్లో డెక్క తూడు తొలగించండి



కలిదిండి, ఫిబ్రవరి 20 : కాల్వల్లో దట్టంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడును వెంటనే తొలగించాలని ఎంపీపీ చందన ఉమా మహేశ్వరరావు కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం భాస్కరరావుపేట - పెదలంక కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదలంక కాల్వ డెక్కతో పూడుకుపోవటంతో తాగునీటి చెరువుకు నీటి వంతు వెళ్లటం లేదన్నారు. పౌలుపేట వద్ద మోటార్లతో నీరు తోడుతున్నా కాల్వలో డెక్క, తూడు, చెత్తాచెదారం పేరుకుపోవటం వల్ల నీరు పారటం లేదన్నారు. ఎక్స్‌వేటర్‌తో కాల్వలో పూడికను యుద్ధప్రాతి పదికన తొలగించాలన్నారు.



ముగిసిన తిరునాళ్ళు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 20: భక్తకోటిని తరింపజేసిన శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి తిరునాళ్ళు మంగళవారంతో ముగిశాయి. స్వామి సన్నిధిలో యోగాంజనేయ స్వామికి పంచామృత స్నపన, సహస్ర తమలపత్రార్చన, అప్పాల నివేదిన, లక్ష్మీనరసింహ సుదర్శన మహామంత్ర హోమం జరిగాయి. హోమానికి మా దల వెంకట సత్యకుమార్ దంపతులు కైంకర్యపరులుగా పాల్గొన్నారు. సాయంత్రం పుష్పయాగం, పవళింపు సేవతో ఈ ఉత్సవాలు ముగిసినట్టు ఆలయ ప్రధానార్చకులు వేదాంతం శేషుబాబు తెలిపారు.